01ATP28_01ATP28.qxd 28-06-2025 PM 10:45 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం 29 జూన్ 2025 పేజీలు : 04

# రూ.100 కోట్లతో పెనుకొండలో ఇంటింటికీ తాగునీరు : మంత్రి సవిత

- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి వైపు పరుగులు హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి
- పెనుకొండలో రూ.62 లక్షలతో అన్న క్యాంటీన్‌కు భూమి పూజ..
- రూ.5 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం
- రూ.1.50 కోట్లతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు



అన్న క్యాంటీన్‌కు భూమి పూజ చేస్తున్న మంత్రి సవిత హిందూపురం పార్లమెంటు సభ్యులు బి కే పార్థసారథి

**పెనుకొండ జూన్ 28 ప్రభాతవార్త**

అమృత్ 2.0 పథకంలో భాగంగా పట్టణంలో రూ.100 కోట్లతో ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు పంపిణీ చేస్తామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత అన్నారు. శనివారం పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు అన్న క్యాంటీన్ నిర్మాణానికి హిందూపురం ఎంపీపీ పార్థసారథితో కలిసి భూమి పూజ నిర్వహించిన తదనంతరం సభలో ఆమె మాట్లాడారు. రూ.5 కోట్లతో పట్టణంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నామని, మరో రూ.2 కోట్లతో పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేయడంతో పాటు పరికరాలు అందజేయనున్నామని తెలిపారు. పెనుకొండ పట్టణంలో రూ.1.50 లక్షలతో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని జోడు గుర్రాల్లా సీఎం చంద్రబాబునాయుడు పరుగులు పెట్టిస్తున్నారన్నారు. పేదలకు మూడు పూటలా కడుపు నింపాలన్న సదుద్దేశంతో అన్న ఎన్టీఆర్ పేరు మీద 201419లో అన్న క్యాంటీన్లను ప్రారంభించారన్నారు. తరవాత వచ్చిన జగన్ రెడ్డి ఆ క్యాంటీన్లను మూసివేశాడన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీకి కట్టుబడుతూ, సీఎం చంద్రబాబునాయుడు మరోసారి అన్న క్యాంటీన్లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు నడుస్తున్నాయని మంత్రి తెలిపారు. కొత్తగా మరికొన్ని అన్న క్యాంటీన్ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం పచ్చ జెండా ఊపిందన్నారు. దీనిలో భాగంగా రూ.62 లక్షలతో పెనుకొండలో అన్న క్యాంటీన్ ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సభలో హిందూపురం పార్లమెంటు సభ్యులు బి.కె పార్థసారథి మాట్లాడుతూ కేవలం ఏడాది కాలంలోనే చంద్రబాబునాయుడు పాలన అభివృద్ధి వైపు సాగిస్తున్నారని .గత ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తున్నామన్నారు. ఉచిత ఇసుక, 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామన్నారు. ఇంట్లో ఉన్న పిల్లలందరికీ తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేశామన్నారు. పోలవరం, అమరావతి రాజధాని పనులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రానికి లక్షల కోట్ల రూపాయల విలువ చేసే పరిశ్రమలను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీసుకొచ్చారన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా సామాజిక పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో అభివృద్ధిని, సంక్షేమాన్ని కొనసాగిస్తున్నామన్నారు . గతంలో ఎన్నడూ లేనంతగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే గతంలో ఎన్నడూ లేనంత అభివృద్ధిని సాధించామన్నారు.. రూ.5 కోట్లతో పెనుకొండలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించనున్నామన్నారు. రూ.2 కోట్ల సీఎస్ఆర్ నిధులతో స్థానిక ప్రభుత్వాసుపత్రిని అభివృద్ధి చేయడంతో పాటు పరికరాలు అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్నో ఏళ్లు ఎదురుచూసిన రైల్వే స్టేషన్ రోడ్డును ఇప్పటికే నిర్మించామని, కోనాపురం రోడ్డుకు భూమి పూజ చేశామని, త్వరలో పనులు చేపట్టనున్నామని తెలిపారు. . విద్యార్థుల భవిష్యత్తను దృష్టిలో పెట్టుకు రూ.6 కోట్లతో టీటీడీ కల్యాణమండపం నిర్మించనున్నామన్నారు. నూతన ఆర్టీసీ డిపో నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రూ.16 కోట్లతో ఎన్టీఆర్ స్మార్ట్ సిటీకి భూమి చేయనున్నట్లు తెలిపారు. అభివృద్ధికి సహకరిస్తున్న సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రులు లోకేశ్, నారాయణకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమాలలో ఆర్డీవో ఆనంద్ కుమార్ తహసిల్దార్ శ్రీధర్ మున్సిపల్ కమిషనర్ సతీష్ కుమార్ తెలుగుదేశం నాయకుల మండల కన్వీనర్ ప్రసాద్ పట్టణ కన్వీనర్ శ్రీరామ్ యాదవ్ తెలుగుదేశం నాయకులు తివేం ద్రలు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో బదిలీ అయిన జిల్లా అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



ఇటీవల బదిలీ అయిన జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ సన్మానిస్తున్న దృశ్యాలు

- బదిలీ అయిన జిల్లా అధికారుల సేవలు స్ఫూర్తిదాయకం
- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వెల్లడి
- బదిలీ అయిన జిల్లా అధికారులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం
- పలువురి అధికారుల సేవలను కొనియాడిన జిల్లా కలెక్టర్

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 :(ప్రభాతవార్త)**

అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో శనివారం సాయంత్రం బాధ్యతాయుత సేవలు అందించి అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న జిల్లా అధికారులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పలువురి అధికారుల సేవలను ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ ప్రస్తావించి వారు చేసిన సేవలను వారితో తనకున్న అనుభవాన్ని జిల్లా కలెక్టర్ పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, డిఆర్ఓ ఏ.మాలోల, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ అనంతపురం జిల్లా నుంచి బదిలీపై వెళుతున్న జిల్లా అధికారుల సేవలు స్ఫూర్తిదాయకమైనవని, ఉత్తమమైనవని పేర్కొన్నారు. బదిలీ అయిన జిల్లా అధికారులను సన్మానించడమనే ఒక ఒరవడి, ఒక సాంస్కృతి జిల్లా పరిపాలనలో ఉండాలని తాను భావిస్తానన్నారు. జిల్లాకు నూతనంగా వచ్చినప్పుడు ఎలా అయితే వస్తారో బదిలీ అయి వెళ్ళేటప్పుడు మిగతా 3లో...





# నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణాన్ని ఛేదించిన పోలీసులు

- మీ సేవా బాబుతో సహా ముగ్గురు అరెస్టు - 15 వేల నకిలీ ఈ-స్టాంపులు విక్రయించిన ఎర్రప్ప అలియాజ్ మీ సేవ బాబు
- ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ దాని అనుబంధ సంస్థల ఫిర్యాదుతోనే కేసు నమోదు - ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని జిల్లా ఎస్పీ డి.జగదీష్ వెల్లడి



అరెస్టుకు గురైన ముగ్గురు నింధితులను చూపుతున్న పోలీసులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ జగదీష్

**అనంతపురం, జూన్ 28 ప్రభాతవార్త బ్యూరో**

అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో బహిర్గతమైన నకిలీ ఈ స్టాంపుల కుంభకోణాన్ని పోలీసులు ఛేదించారు. ఎర్రప్ప అలియాజ్ మీ సేవ బాబుతోపాటు ముగ్గురుని అరెస్టు చేసినట్లు అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడించారు. నకిలీ ఈ స్టాంపుల కేసును మొదట అనంతపురం టూ టౌన్ స్టేషన్‌లో నమోదైందని, ఆ కేసును కళ్యాణదుర్గానికి బదిలీ చేశామని, ఈ కేసును ఇంకా దర్యాప్తు కొనసాగుతుందని జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఈ కేసు వెనుక ఇంకా ఎవరైనా పెద్దలు ఉన్నారా, అని విలేకర్లు అడగగా కేసుదర్యాప్తు ఇంకా కొనసాగుతుందని వెల్లడించారు. ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఇతర సంస్థలు ఫిర్యాదు చేయడం వల్లనే నకిలీ ఈ స్టాంపుల బాగోతాన్ని పోలీసులు వెలికి తీసినట్లు ఆయన వెల్లడించారు. జిల్లా ఎస్పీ కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ జగదీష్ మాట్లాడుతూ.. ఎర్రప్ప అలియాజ్ మీ సేవా బాబు భార్య పేరుతో ఏజెన్సీ ఉందని, ఆ ఏజెన్సీ వారు 15వేల నకిలీ ఈ స్టాంపులు విక్రయించారని అందులో టీడీపీ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు చెందిన ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు 410 నకిలీ ఈ స్టాంపులు ఎర్రప్ప అలియాజ్ మీసేవ బాబు విక్రయించారన్నారు. ఆ సంస్థ అనుబంధ సంస్థలకు మరో 28 ఈ స్టాంపులను విక్రయించారన్నారు. నకిలీ ఈ స్టాంపులకు పాల్పడిన ఎర్రప్ప మరో నలుగురి నుంచి కంప్యూటర్లు, ప్రింటర్లు స్వాధీనం చేసుకున్నట్లు, ఈ స్టాంపుల కుంభకోణం నింధితులు నలుగురు దాదాపు రూ.2కోట్ల వరకు లావాదేవీలు చేసినట్లు పోలీసులు గుర్తించినట్లు ఎస్పీ తెలియజేశారు. ఇంకా 15,414 ఈస్టాంపు పేపర్లు తనిఖీ చేయాల్సి ఉందని, వాటిలో నకిలీ స్టాంపులు ఏవైనా ఉన్నాయా అని చూడాల్సి ఉందని, మొత్తం ఈ స్టాంపుల దర్యాప్తు చేసేందుకు బ్యాంకర్లు, ఇతర సంస్థలు కూడా భాగస్వామ్యం కావాల్సి ఉందన్నారు. నకిలీ ఈ స్టాంపుల విషయంలో ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఎర్రప్ప కేవలం ఆరు లక్షల స్టాంప్ డ్యూటీ ప్రభుత్వానికి చెల్లించారన్నారు. దాదాపు 25,48,000 రూపాయల స్టాంప్ డ్యూటీని ఎర్రప్పకు చెందిన ఏజెన్సీ ప్రభుత్వానికి కట్టకుండా వాడుకున్నట్లు ఆయన వెల్లడించారు. నకిలీ ఈ స్టాంపులు అమ్మి సొమ్ము చేసుకున్న డబ్బును ఎర్రప్ప తన అకౌంట్ నుంచే విత్‌డ్రా చేసుకున్నాడని, ప్రస్తుతం ఎర్రప్ప అకౌంట్‌లో లక్ష రూపాయలు కూడా లేదని జిల్లా ఎస్పీ వెల్లడించారు. ఎవరైనా ఎర్రప్ప భార్య పేరుతో ఉన్న ఏజెన్సీ వద్ద ఈ స్టాంపులు కొనుగోలు చేసి మోసపోతే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన వెల్లడించారు. ఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్, దాని అనుబంధ సంస్థలు సూరద్ ఇన్‌ఫ్రా, అమిలినేని, నియోకన్‌స్ట్రక్షన్స్ కొనుగోలు చేసిన ఈ స్టాంపులకు మొత్తం అమౌంట్‌ను ఎర్రప్పకు చెందిన అకౌంట్‌కు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేశారని అందుకు తగ్గ బ్యాంకు రిపోర్టులు ఉన్నట్లు ఆయన వెల్లడించారు. అయితే ఆ డబ్బుకు పక్కాగా ఈస్టాపులను ఇవ్వకుండా 100 ఈ స్టాంపులను లక్ష రూపాయలుగా ట్యాంపరింగ్ చేసి ఎర్రప్ప తదితరులు మోసానికి పాల్పడినట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ కేసులో బోయ ఎర్రప్ప, కురుబ మోహన్‌బాబు, భువనేశ్వర, కట్టా భార్గవిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ నలుగురు ముద్దాయిలకు కళ్యాణదుర్గం టౌన్‌లో ఎలాంటి లాకర్లు ఉన్నట్లు తేలలేదన్నారు. ఈ స్టాంపుల విషయంలో ఎస్ఆర్‌సి, దాని అనుబంధ సంస్థలు దాదాపు 32 లక్షల రూపాయలు స్టాంప్ డ్యూటీ కింద మీ సేవ బాబు అకౌంట్‌లో జమా చేయగా అందుకు ప్రతిగా మీసేవా నిర్వాహకులు 6,52,000 రూపాయలు మాత్రమే ప్రభుత్వానికి చెల్లించారని, 25,48,000 రూపాయలు ప్రభుత్వానికి కట్టకుండా మోసం చేసినట్లు ఆయన వెల్లడించారు. బోయ ఎర్రప్పకు చెందిన ఏజెన్సీ వారు కర్నూలులోని స్టాక్ హోల్డింగ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా నుంచి 15,851 ఈ స్టాంపులు స్టేషనరీ డ్రా చేసినట్లు దానికి ప్రతిగా ప్రభుత్వానికి ఇప్పటి వరకు ఈ స్టాంప్ డ్యూటీ కింద 32,80,705 రూపాయలను చెల్లించినట్లుగా సమాచారం వచ్చిందన్నారు. ఇంకా ఎవరైనా ఈ స్టాంపుల విషయంలో కొనుగోలు చేసి మోసపోయిన వారు ఉంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

# వివాదం రేకెత్తించిన విచారణ

- విచారణ పేరుతో యువకునిపై పోలీసుల దాష్టీకం
- ఏఎస్పీని విచారణకు ఆదేశించిన ఎస్పీ జగదీష్
- చర్చకు దారితీసిన పెద్దపెప్పూరు పోలీసు స్టేషన్ ఘటన
- సంఘటన తీరును మార్చేందుకు స్థానిక నాయకుల యత్నం



పెద్దపప్పూరు పోలీసుస్టేషన్



లాఠీ దెబ్బలను విలేకరులకు చూపుతున్న వంశీకృష్ణ

**పెద్దపప్పూరు(తాడిపత్రి),జూన్ 28, ప్రభాతవార్త**

ఓ మైనర్ బాలిక అదృశ్యంపై విచారణ చేపట్టిన పోలీసులు అందులో భాగంగా ఓయువకునిపై దాష్టీకం ప్రదర్శించి మరో కొత్త వివాదానికి తెరతీశారు. తాడిపత్రి పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని పెద్దపప్పూరు పోలీసుస్టేషన్‌లో ఈ నెల 18న ఓ మైనర్ బాలిక అదృశ్యం కేసు నమోదైంది. పెద్దపప్పూరు స్టేషన్ పరిధిలోని ఓ మైనర్ బాలికను పెద్దపప్పూరుకుచెందిన మెకానిక్ హేమంత్ అపహరించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది. ఆ బాలికను అపహరించినట్లు అనుమానిస్తున్నమెకానిక్ హేమంత్ గురించి తెలుసుకోవడానికి అతని స్నేహితులు 10 మందిని పది రోజులుగా పోలీసులు విచారణకు పిలుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో వంశీకృష్ణను పోలీసులు శుక్రవారం రాత్రి పెద్దపప్పూరు పోలీసు స్టేషన్‌కు విచారణకై పిలిచారు. వంశీకృష్ణ చరవాణిలో మిగతా 3లో...

# నిబంధనల ప్రకారంగా ప్లేస్ ఇవ్వడం లేదని వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆందోళన

- మీకు నచ్చిన ప్లేస్ కాదు... మేము ఇచ్చిన ప్లేస్ తీసుకోండి - వెల్ఫేర్ అసిస్టెంట్లకు డీడీ రామాంజనేయులు హుకుం
- కౌన్సెలింగ్‌ను బాయికాట్ చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్లు - ర్యాలీగావెళ్లి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్లు
- నేటికి బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియ వాయిదా



డిడితో వాగ్వివాదం చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌లు



కౌన్సిలింగ్ బాయ్‌కాట్ చేసి ఆందోళన చేస్తున్న దృశ్యం

**అనంతపురం న్యూటౌన్, జూన్ 28 ప్రభాతవార్త**

జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ (ఎఫ్‌ఎసి) రామాంజనేయులు , శ్రీ సత్యసాయి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా అధికారి శివరంగ ప్రసాద్ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని అంబేద్కర్ భవనంలో మధ్యాహ్నం 2 గంటల నుండి వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియను ప్రారంభించారు. సీనియార్టీ జాబితాలో మిగతా 3లో...

# జాకీ స్థానంలో రేమండ్ సంస్థ..

- ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే పరిటాల సునీత..
- 330కోట్ల పెట్టుబడులతో.. 3వేల మందికి ఉపాధే లక్ష్యం..
- రాప్తాడును పారిశ్రామికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం.. ఎమ్మెల్యే సునీత..



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, జూన్ 28 ప్రభాతవార్త బ్యూరో**

రాప్తాడు నియోజకవర్గానికి ప్రఖ్యాత గార్మెంట్స్ పరిశ్రమ రేమండ్ సంస్థ రాబోతోంది. గతంలో జాకీ పరిశ్రమ వచ్చిన ప్రాంతంలోనే ఈ పరిశ్రమ రానుందని అనంతపురం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో రాప్తాడు సమీపంలో జాకీ పరిశ్రమ స్థాపనకు ఆ సంస్థ ముందుకొచ్చిందని గుర్తు చేశారు. ఇందుకు సంబంధించిన పనులు కూడా జరుగుతున్న సమయంలో అధికారం మారడంతో ఆ పనులు అక్కడితో ఆగిపోయాయన్నారు. తమకు కమీషన్లు ఇవ్వాలంటూ మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అతని సోదరులు జాకీ సంస్థను బెదిరించడంతో వారు హైదరాబాద్ కు వెళ్లి యూనిట్‌ను ఏర్పాటు చేశారన్నారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో మేము మరో గార్మెంట్స్ సంస్థను తీసుకొస్తామంటూ ఐదేళ్ల పాటు కాలం గడిపారన్నారు. కానీ తాము ఎన్నికల ముందు చెప్పినట్టుగా జాకీ పరిశ్రమను తిరిగి రప్పించడం లేదా అదే స్థానంలో ఆ స్థాయికి తగ్గ పరిశ్రమను తీసుకొస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చొరవతో ప్రఖ్యాత రేమండ్ సంస్థ తమ యూనిట్‌ను జాకీ స్థానంలో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిందన్నారు. రాప్తాడు దగ్గర 26.87 ఎకరాలను ఎకరా రూ.20 లక్షల చొప్పున కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. ఈ ప్రాజెక్టు కోసం స్థిర మూలధన పెట్టుబడి (ఎఫ్సీఐ) కింద రూ.330 కోట్లను పరిగణనలోకి తీసుకుని.. దానిపై ప్రోత్సాహకాలు చెల్లించేందుకు అనుమతించిందన్నారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా 3వేల మందికి పరోక్షంగా మరికొన్ని వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉందన్నారు. రేమండ్ సంస్థ రాప్తాడుకు వచ్చేలా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు రాప్తాడు నియోజకవర్గ ప్రజల తరుపున కృతజ్ఞతలు చెబుతున్నామన్నారు. దీంతో పాటు ఇటీవల దాదులూరు వద్ద ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించామని, ఇక్కడికి కూడా అనేక కంపెనీలను ఆహ్వానిస్తున్నట్టు చెప్పారు. అలాగే చెన్నేకొత్తపల్లి ప్రాంతంలో కూడా 4వేల ఎకరాలు ఉందని.. ఇక్కడ రైతులను ఒప్పించి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు చెప్పారు. ఓవైపు హంద్రీనీవా ద్వారా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడంతో పాటు ఇంకో వైపు పారిశ్రామికీకరణ దిశగా అడుగులు వేస్తున్నట్టు చెప్పారు. త్వరలోనే పేరూరు ప్రాజెక్టుకు హంద్రీనీవా నీరు అందించే పనులు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం చెబుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. రానున్న నాలుగేళ్లలో ఇవన్నీ పూర్తి చేసే విధంగా పని చేస్తామని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# భవన నిర్మాణ అనుమతుల కోసం ఎదురుచూపు



- ఆన్‌లైన్ అనుమతుల కోసం జాయింట్ కలెక్టర్ వద్ద పెండింగ్
- మూడు సంవత్సరాలుగా గ్రామపంచాయతీలకు స్టాంప్ డ్యూటీ చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం.. గ్రామ సర్పంచులు.
- పంచాయతీలకు ఆదాయం సమకూర్చడానికి ఇబ్బందులు పడుతున్నాం... పంచాయతీ కార్యదర్శులు.
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాలి

**అనంతపురం రూరల్ జూన్ 28 ప్రభాతవార్త**

అనంత జిల్లాలో భవన నిర్మాణాల కోసం ఇచ్చే ఆన్లైన్ పర్మిషన్ల అనుమతులను గత మూడు నెలలుగా జాయింట్ కలెక్టర్ నిలిపివేయడంతో గ్రామ పంచాయతీలలో నూతనంగా భవన నిర్మాణాలు చేసుకోవాలనుకుంటున్న తీవ్ర ఇబ్బందులకు గురి కావడం జరుగుతుందని గ్రామాలలోని ప్రజలు తెలియజేశారు. భవన నిర్మాణాల అనుమతి కోసం గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్దకు పోతే గత మూడు నెలలుగా భవన నిర్మాణాల కోసం ఇచ్చే ఆన్లైన్ అనుమతులు జాయింట్ కలెక్టర్ నిలిపివేయడం జరిగిందని కావున మేము భవన నిర్మాణాల కోసం ఆన్లైన్ అనుమతులు ఇవ్వలేమని పంచాయతీ కార్యదర్శులు తెలపడం జరుగుతుందని రాష్ట్రంలో ఏ జిల్లాలో లేని నిబంధనం కేవలం అనంత జిల్లాలో మాత్రమే అమలు చేస్తూ భవన నిర్మాణాల కోసం ఇచ్చే ఆన్లైన్ అనుమతులు ఎందుకు నిలిపివేయడం జరిగిందో తెలియడం లేదని కావున ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్ భవన నిర్మాణాల కోసం ఇచ్చే ఆన్లైన్లో పై దృష్టి సారించి మేము ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొనిగ్రామపంచాయతీలలో భవన నిర్మాణాల కోసం ఇచ్చే ఆన్లైన్ పర్మిషన్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామాలలోని ప్రజలు జాయింట్ కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994లో గ్రామ పంచాయితీల్లో ఆస్తి బదిలీ భూ రిజిస్ట్రేషన్ ఇతర లావాదేవీల పై రాష్ట్ర ప్రభుత్వం విధించిన సుంకల్లో గ్రామ పంచాయతీలకు ఆదా య వనరు లాంటి స్టాంప్ డ్యూటీ అమలు చేసింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామపంచాయతీలకు రావాల్సిన వాటా నగదు విడుదల చేస్తేనే గ్రామ పంచాయతీలా అభివృద్ధి మౌలిక సదుపాయాల అభివృద్ధికి సాధ్యమవుతుంది. గత వైసిపి ప్రభుత్వంలో మూడు సంవత్సరాలుగా గ్రామ పంచాయతీ సర్పంచులు స్టాంప్ డ్యూటీ నిలిపివే యడంతో గ్రామపంచాయతీ లో ప్రజలకు మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం గ్రామ సర్పంచులు డబ్బు ఖర్చు పెట్టి పనులు చేయడం జరిగిందని, చేసిన పనులకు బిల్లులు కాక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్ భవన నిర్మాణాలకు ఆన్లైన్ అనుమతులు కల్పించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

## గత మూడు నెలలుగా భవన నిర్మాణ ఆన్లైన్ అనుమతులను నిలిపివేసిన జేసి

గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల్లో సొంత భవనాలను నిర్మించుకోవడానికి భవన నిర్మాణల అనుమతుల కోసం ప్రజలు గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చి అనుమతులు తీసుకొని భవన నిర్మాణాలు చేపట్టే వారని, కానీ గత మూడు నెలలుగా భవన నిర్మాణాలకు ఇచ్చే ఆన్లైన్ పర్మిషన్లను జాయింట్ కలెక్టర్ నిలిపివేయడంతో భవన నిర్మాణాల అనుమతి కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ భవన నిర్మాణాల అనుమతులు ఆన్లైన్లో పన్ను చెల్లింపు సౌకర్యం కల్పించకపోవడంతో గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయానికి గండి పడుతుండడంతో గ్రామాల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్ భవన నిర్మాణాల కోసం ఇచ్చే అనుమతులు పై దృష్టి పెట్టి ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకుని ఆన్లైన్ అనుమతులు ఇవ్వాలని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామాలభివృద్ధితో పాటు సిబ్బంది జీతాల చెల్లించలేక ఇబ్బంది పడుతున్నాము : పంచాయితీ కార్యదర్శులు.

గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలు, అదే విదంగా ప్రజలకు కావలసిన మౌలికమైన పనులు అభివృద్ధి చేయాలంటే భవన నిర్మాణ అనుమతులు,పన్నులు ద్వారా వచ్చే ఆదాయంతోనే గ్రామాల అభివృద్ధి చేయడానికి వీలుంటుందని కానీ గత మూడు నెలలుగా జిల్లాలో బిల్డింగ్ అప్రూవల్ ఆన్లైన్ చేయడానికి జాయింట్ కలెక్టర్ నిలిపివేయడంతో గ్రామాలను అభివృద్ధి చేయడంతో పాటు, గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులుకు అదేవిదంగా సిబ్బందికి నెలనెలా జీతాల చెల్లించడానికి అదే విదంగా పంచాయతీరాజ్ శాఖకు ఆదాయాన్ని సమకూర్చలేక పోతున్నామని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సర్పంచు లకు స్టాంప్ డ్యూటీ జమ చేయాలని ప్రభుత్వం ను గ్రామాల సర్పంచు లు కోరారు. అదేవిదంగా భవన నిర్మాణ పన్నుల చెల్లింపు కోసం ఆన్లైన్ అనుమతుల సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామాల్లోని ప్రజలు జేసీ ని కోరుతున్నారు.

02ATP27_02ATP27.qxd 28-06-2025 PM 10:39 Page 1



## కన్నేపల్లిలో పౌర హక్కుల పై అవగాహన



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసిల్దార్

**బ్రహ్మసముద్రం జూన్ 28 ప్రభాతవార్త**

మండలంలోని కన్నెపల్లి గ్రామంలో తాసిల్దార్ సుమతి పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ప్రతినెలా జరిగే పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమంలో తాసిల్దార్ మాట్లాడుతూ పౌర హక్కులు అనేది పౌరులు అందరు సమానమేనని ప్రతి ఒక్కరూ తెలుసుకొని కుల వివక్ష చూపకుండా పౌరులంతా వారి హక్కులకు భంగం కలగకుండా మెలగాలని అన్నారు ఎస్సీలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించి వారి హక్కులకు భంగం కలిగించకుండా చూడాలని కన్నెపల్లి ప్రజలకు పౌర హక్కుల కార్యక్రమం ద్వారా తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగిరెడ్డి వార్డెన్ శ్రీనివాసులు వీఆర్వో నాగరాజు పోలీస్ గురుదప్ప ప్రజలు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీపీ రాజగోపాల్ రెడ్డి సతీమణి మృతి

### సంతాపం తెలియజేసిన మెట్టు గోవింద రెడ్డి



మాజీ ఎంపీపీ సతీమణికి నివాళులర్పిస్తున్న మెట్టు

**కనేకల్లు జూన్ 28 ప్రభాతవార్త**

అనారోగ్యంతో గరుడచేడు గ్రామంలో శనివారం వైసీపీ నేత మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్ రెడ్డి భార్య మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాయదుర్గం నియోజకవర్గం సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి శనివారం మృతురాలి స్వగృహం నందు ఆమెకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మెట్టు గోవింద్ రెడ్డి విజయలక్ష్మి మంచి మనసున్న మనిషిని కోల్పోవడం చాలా బాధాకరమని, ఆత్మకు శాంతి కలగాలని, ఆ కుటుంబానికి తట్టుకునే శక్తి ధైర్యం ప్రసాదించాలని కోరుకున్నారు. మాజీ ఎంపీపీ ఆలేరి రాజగోపాల్ రెడ్డిని సమదాయించి ఓదార్చారు. మెట్టు గోవింద్ రెడ్డి వెంట మారంపల్లి మారన్న ఆది సద్గురుపాటిలైజర్స్ చంద్రశేఖర్ రెడ్డి రచ్చ మర్రి హల్లి నాగరాజు తదితరులు ఉన్నారు.

## మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించండి

**రాయదుర్గం జూన్ 28 ప్రభాతవార్త**

మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి బి మల్లికార్జున ప్రభుత్వాన్ని కోరారు శనివారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులతో కలిసి స్థానిక వినాయక కూడలి నుండి మున్సిపల్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం మున్సిపల్ కార్యాలయం ముందు అరగంట పాటు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ, జీవో నెంబర్ 36 ప్రకారం మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు 21 వేల నుండి 24 వేల ఐదు వందల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్సులు ఇవ్వాలని, ఆప్కాస్ విధానాన్ని రద్దు చేయాలనుకుంటే ముందుగా మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, అదేవిధంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అన్నిటిని మున్సిపల్ ఔట్సోర్సింగ్ కార్మికులకు వర్తింపజేయాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రతి మున్సిపల్ కార్మికునికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యొక్క సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో జూలై 4న చలో విజయవాడ కార్యక్రమం తో పాటు నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు తిప్పేరుద్ర మరియు నాయకులు నరసింహులు మైలారి శివానంద శ్రీనివాసులు రాము తదితరులు పాల్గొన్నారు.

## మామిడిమాకులపల్లిలో తాగునీటి సమస్య



ట్యాంకర్‌తో నీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

**లేపాక్షి, జూన్ 28 ప్రభాతవార్త**

మండలంలోని మామిడిమాకులపల్లిలో తాగునీటి సమస్య తలెత్తింది. గ్రామంలో నీటిని సరఫరా చేసే రెండు బోర్లకు సంబంధించిన మోటార్లు రెండు రోజుల క్రితం కాలిపోవడంతో తాగునీటి సమస్య తలెత్తింది. శనివారం సర్పంచు గంగలక్ష్మమ్మ ప్రజలకు తాగునీటి సమస్య తీర్చేందుకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. రెండు రోజుల్లో మోటార్లను బిగించి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని సర్పంచు పేర్కొన్నారు.

## గుత్తి సర్కిల్‌కు రెండు బైకుల కేటాయింపు



నూతన బైకులను సిఐ ఆవిష్కరిస్తున్న దృశ్యం

**గుత్తి, జూన్ 28 ప్రభాతవార్త**

గుత్తి అర్బన్ సర్కిల్ పరిధిలో పెట్రోలింగ్ డ్యూటీ నిమిత్తం సిబ్బందికి జిల్లా ఎస్పి జగదీష్ రెండు ద్విచక్ర వాహనాలను కేటాయించారు. శనివారం సాయంత్రం అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు బైకులను ప్రారంభించారు. శాంతి భద్రతల నిర్వహణకు పెట్రోలింగ్ ఉపకరిస్తాయని ఈ సందర్భంగా సిఐ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీకి నలుగురు విద్యార్థులు ఎంపిక

**గుత్తి, జూన్ 28 ప్రభాతవార్త**

పట్టణంలోని మోడల్‌స్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ప్రతిష్ట కుమారి తెలిపారు. ఇడుపులపాయ నూజివీడు ట్రిపుల్ఐటికి వైష్ణవికిరణ్,ధీరజ్, నరసింహ,సాయిలు ఎంపిక య్యారు. ఈసందర్భంగా పాఠశాలలో ఆవిద్యార్థులను అభినందించారు.

# ర్యాంకుల ఆధారంగా బదిలీలు చేపట్టండి

**- ఆందోళన చేపట్టిన సచివాలయ ఉద్యోగులు - గందరగోళంగా సాగిన కౌన్సిలింగ్ ప్రక్రియ**





కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డిపిఓలు , పంచాయితీ కార్యదర్శిలతో మాట్లాడుతున్న అధికారులు

**అనంతపురం సిటీ, జూన్ 28 ప్రభాతవార్త**

సచివాలయ ఉద్యోగుల బదిలీలు ర్యాంకుల ఆధారంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ సచివాలయ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డిపిఆర్‌సి సమావేశ మందిరంలో సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సిలింగ్‌ను శనివారం చేపట్టారు. ఉమ్మడి జిల్లా సచివాలయ ఉద్యోగుల గ్రేడ్-5, గ్రేడ్-6 బదిలీల కౌన్సిలింగ్ ను ఉమ్మడి జిల్లాల డిపిఓల ఆధ్వర్యం లో చేపట్టారు. అయితే కౌన్సిలింగ్‌కు హాజరైన సిబ్బంది నుంచి వారు కోరుకున్న ప్రాంతాలకు ఆప్షన్లనుతీసుకుని వాటిని తిరిగిక్రోడీకరించి ఉత్తర్వులను అందించేదిశగా అధికార యంత్రాం గం చర్యలు చేపట్టింది. దీంతో కౌన్సిలింగ్‌కు హాజరైన ఉద్యోగులు అభ్యంతరం వ్యక్తం చేశారు. కౌన్సిలింగ్ సమయంలోనే తమకు నిర్దేశించిన స్థానాలను కేటాయించక పోవడం వెనుక రాజకీ య ఒత్తిళ్లతో తమకు అన్యాయం జరిగే ఆస్కారం ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తూ డిపిఆర్‌సి



ధర్నా నిర్వహిస్తున్న పంచాయితీ కార్యదర్శిలు

భవనంఎదుట పంచాయితీ కార్యదర్శిలు ధర్నా చేపట్టారు. వ్యూవాంట్ జస్టిస్ అటూ నినాదాలు చేస్తూ ధర్నాచేపట్టడంతో ఉమ్మడి జిల్లాల డిపిఓలు వారి వద్దకు వచ్చి పంచాయితీ కార్యదర్శిలకు కౌన్సిలింగ్ ప్రక్రియను ఆదివారం చేపడుతామని తెలపడంతో వారు శాంతించారు. శనివారం నిర్వహించిన కౌన్సిలింగ్‌లో వికలాంగులు, స్పౌజ్ డిజిటల్ అసిస్టెంట్లకు నిర్వహించారు. అయితే కౌన్సిలింగ్ ప్రక్రియలో అధికారులు పోస్టుల కేటాయింపుపై సమగ్రతను పాటించి పోస్టింగుల కేటాయింపు ఉత్తర్వులను చేపట్టకపో వడం వెనుక ఉద్యోగులలో అనుమా నాలు వ్యక్తం చేస్తున్నారు. రాజకీయ ఒత్తిళ్ల మేరకు, రాజకీయ నేతల సిఫార్సులు పొందిన వారికి అనువైన ప్రాంతాలను కేటాయిస్తూ తమకు అప్రాధాన్యత ప్రాంతాల్లో పోస్టులు కేటాయిస్తారన్న భయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అయితే అధికారులు మాత్రం ఒక్కో స్థానానికి అత్యధికంగా ఆప్షన్లను ఎంచుకోవడం సత్యసాయి జిల్లా నుంచి అనంతపురం జిల్లాకు బదిలీలు కావాలంటూ కోరుకోవడంతో వాటిని క్రోడీకరించేందుకు సమయం కావాల్సి వస్తోందని, సత్యసాయి జిల్లా కూడా ప్రాధాన్యత మేరకు సిబ్బందిని కేటాయించాల్సి ఉన్నందున పోస్టుల కేటాయింపుకు సమయం అవసరం అవుతోందని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ గందరగోళం మధ్య ప్రారంభమైంది. అధికారులు చెబుతున్న మాటలకు ఆచరణలో సిబ్బందికి పారదర్శకంగా బదిలీల ప్రక్రియ చేస్తారా లేదా అన్నది వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## రాజకీయపార్టీల నాయకులతో కలిసి ఈవిఎం గోదాము తనిఖీ

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్**



ఈవీఎంల గోదామును జిల్లా కలెక్టర్ పరిశీలిస్తున్న దృశ్యం

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త**

అనంతపురం నగరంలోని పాత ఆర్డీఒ కార్యాలయంలో సమీపంలో భద్రపరిచిన ఈవిఎంల గోదామును శనివారం జిల్లా రెవిన్యూ అధికారి మలోల, ఆర్డీఒ కేశవనాయుడు, రాజకీయపార్టీల నాయకులతో కలసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలెక్ట్రానిక్ ఓటింగ్ యాంత్రాలు భద్రపరిచిన గోదామును వద్ద 247 పటిష్టమైన భద్రత వుందన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేయవలసి వుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా రాజకీయపార్టీల నాయకుల సమక్షంలో గోదామును ఓపెన్ చేసి గోదాము లోపల భద్రపరిచిన ఈవిఎం యంత్రాలు బియులు, సియూలు, వివి ప్యాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం తిరిగి రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో క్లోజ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ సి సెక్షన్ పర్యవేక్షకులు యోగేశ్వరిదేవి, ఎలెక్షన్ డిటి కనకరాజు, బిజెపి నుండి ఎంపి ఈశ్వర్‌ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నుండి ఇమామ్‌వలీ, వైసిపి నుండి శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీ పార్టీ నుండి ఎస్.మసూద్‌వలి, జనసేన పార్టీ నుండి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## మహా న్యూస్ ఛానల్ పై దాడిని ఖండించిన మాజీమంత్రి పల్లె

**పుట్టపర్తి టౌన్ జూన్ 28 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె

హైదరాబాదులో మహా న్యూస్ ఛానల్ కార్యాలయం పై దాడి చేయడం దుర్మార్గ మైన చర్య అని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన ఒక ప్రకటన విడుద ల చేస్తూ ప్రజాస్వామ్యంలో పత్రికలకు మీడియా ఛానళ్ల కు ప్రత్యేక స్థానం ఉందన్నా రు. మీడియాలో వచ్చే కథనాలపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత వ్యక్తులు మీడియా ద్వారా ఖండించాలే తప్ప ఇలా దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇంకా ఏమైనా అభ్యంతరకరమైన అంశాలు ఉంటే చట్టపరంగా న్యాయస్థానాలను ఆశ్రయించాలి తప్ప ఇలా ఐక్యంగా మీడియా కార్యాలయాలపై దాడికి దిగడం సరైనది కాదన్నారు. ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని కోరారు. దాడి చేసిన వ్యక్తులపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని మరోకసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

## నా కుమారునికి న్యాయం చేయండి

**-పోలీసులను ఆశ్రయించిన కాంట్రాక్ట్ కార్మికుడు మస్తాన్ కుటుంబ సభ్యులు**



రూరల్ సిఐ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన మస్తాన్ కుటుంబ సభ్యులు

**గుంతకల్లు, జూన్ 28 ప్రభాతవార్త**

తమ కుమారునికి న్యాయం చేయాలని కాంట్రాక్ట్ కార్మికుడు మస్తాన్ కుటుంబ సభ్యులు శనివారం రూరల్ పోలీసులను ఆశ్రయించారు. పట్టణంలోని పాత గుంతకల్లులో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా కావడంతో ఫోల్ టు ఫోల్ కార్మికుడు మస్తాన్ జూన్ 7న విద్యుత్ స్తంభంపై నుండి కింద పడి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. అప్పటి నుండి బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా మస్తాన్ తల్లి అమిధాబీ మాట్లాడుతూ తన కుమారునికి ఒక చెయ్యి తీసేశారని, కాలికి కూడా ప్లాస్టిక్ సర్జరీ చేయాలని వైద్యులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్య ఖర్చుల నిమిత్తం ఇప్పటికే దాదాపు 6 లక్షలకు పైగా ఖర్చయిందని పేర్కొన్నారు. తమ స్తోమతకు మించి ఖర్చు చేశామని, సంబంధిత లైన్ ఇన్‌స్పెక్టర్ గానీ, అధికారులు గానీ పట్టించుకోవడంలేదని వాపోయారు. తన కుమారునికి భార్య, కొడుకు, కూతురు వున్నారని తన భవిష్యత్తు ఎలా వుంటుందోనని ఆమె ఆందోళన వ్యక్తం చేస్తూ కన్నీరు పెట్టుకున్నారు. తమ కుమారునికి న్యాయం చేయాలని పోలీసులు ఆశ్రయించామన్నారు. ఇదిలా వుండగా జరిగిన ఘటనపై విచారణ చేపట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని సిఐ ప్రవీణ్‌కుమార్ ప్రభాతవార్తకు తెలిపారు.

## ఘనంగా 9వ వార్షిక మహా సభ




ఏఎల్‌పి రిజియానా మాట్లాడుతున్న దృశ్యం

**బెలుగుప్ప, జూన్ 28 ప్రభాతవార్త**

బెలుగుప్ప మండల కేంద్రంలో ఉత్పత్తి దారులు పరస్పర సహాయక సహకార సంఘం సభ్యులు ఘనంగా 9వ వార్షిక మహా సభ శనివారం నిర్వహించారు. ముందుగా ఫాదర్ ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సభాధ్యక్షులుగా శ్రీర్షీ వహించగా ముఖ్య అతిథిగా ఏఎల్‌పి రిజియానా పాల్గొని మాట్లాడుతూ.. రైతులకు సంబంధించిన 24-25 సంవత్సరాల ఆర్థిక



కార్యక్రమానికి హాజరైన సహాయక సహకార సంఘం సభ్యులు

లావాదేవీలు, 47 సంవత్సరాల నుంచి ఏర్పాటు చేసిన బెలుగుప్ప మండల సభ్యుల్లో మొదట 5 లక్షలను ఏర్పాటు చేసి, ఈ రోజు వరకు 3 కోట్ల వరకు టర్నోవర్ జరుగుతోందని, ప్రతి సంవత్సరం 20 లక్షల వరకు అమ్మకాలు, కొనుగోలు దారులు అవుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరు తాము పండించిన పంటను దళారులకు కాకుండా, ఆర్డిటి సంస్థ ఏర్పాటు చేసిన వ్యాపార అంగడికి అందించాలని, 25 శాతం సబ్సిడితో రైతులకు విత్తనాలు కానీ, రైతులకు సంబంధించిన పనిముట్లు, డ్రిప్ పరికరాలు 25 శాతం సబ్సిడితో తక్కువ ధరకే అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పథకాల వలే ఎకాలజీ సెంటర్‌కు అనుసంధానం, వర్కుషాపులుకూడా నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి ఒక్క రైతు సంఘంలో ఉండే రైతు తాము పండించిన పంటలను దళారి వ్యవస్థకు కాకుండా ఆర్డిటికి అందివ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపిఈఓ మేనేజర్ రమేష్, ఎంపిఎల్ భవాని, సిఇఓ గాయత్రి, మండల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిగుండం ఏర్పాటు



బత్తలపల్లిలో ఏర్పాటు చేసిన అగ్నిగుండం

**బత్తలపల్లి, జూన్ 28 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన బత్తలపల్లిలోని బొప్పేపల్లి కాశింస్వామి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి ఉత్సవాలను గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ప్రారంభించారు. శనివారం పీర్ల చావిడి ముందు అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ప్రతి ఏడాది అగ్నిగుండం పెరుగుతుండడంతో అందులోని బూడిదను ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. జేసీబీ సాయంతో అగ్నిగుండంను తీశారు. దీంతో చిన్నారులు చెత్తను. ముళ్లకంపను తీసుకువచ్చి అగ్నిగుండంను రగిలించి గుండం చుట్టూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. ఇదిలా ఉండగా ముజావర్లు మహబూబ్ బాషా, కాశింఫీరా, ఫకృద్దీన్, కాశింవలిలు చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్ఐ సోమశేఖర్ గ్రామస్తులకు సూచించారు.

## వైభవంగా శ్రీవారి ప్రాకారోత్సవం

**-స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించిన భక్తులు**

**ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త**



లక్ష్మినరసింహస్వామి ప్రాకారోత్సవం దృశ్యం

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఆషాడ శుద్ధ తదియ శనివారం సాయంత్రం లక్ష్మినరసిం హుని పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు పర్యవేక్షణలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నింబగల్లు గ్రామ సచివాలయానికి తాళం..!

**-సిబ్బంది విధులకు రాకపోవడంతో తెరుచుకోని సచివాలయం**

**-ఎప్పుడూ ఇక్కడ ఇదే పరిస్థితి ఉంటోందంటున్న గ్రామ ప్రజలు**



నింబగల్లు గ్రామ సచివాలయానికి తాళంవేసి ఉన్న దృశ్యం

**ఉరవకొండ, జూన్ 28 ప్రభాతవార్త**

మండల పరిధిలోని నింబగల్లు గ్రామ సచివాలయం శనివారం తెరుచుకోలేదు. సిబ్బంది ఎవరూ విధులకు హాజరు కాకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. దీంతో సచివాలయంలో వివిధ పనుల కోసం ప్రజలు వచ్చి వెనుదిరగాల్సి వచ్చింది. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ కొందరు సిబ్బంది ఇక్కడ అందుబాటులోనే ఉండరని దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. సచివాలయానికి ఎప్పుడు వెళ్లినా మూసే ఉంటోందని అప్పుడప్పుడు అందుబాటులో ఉండే ఒకరిద్దరిని మిగిలిన వారు ఎక్కడని అడిగితే వారు అక్కడికెళ్లారు, ఇక్కడికెళ్లారని చెప్పుకొస్తున్నారని విమర్శిస్తున్నారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న గ్రామంలోనే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందాలని సచివాలయాలు ఏర్పటయ్యాయని అయితే ఇక్కడ కొందరు సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందంటున్నారు. సిబ్బంది కొందరు నిత్యం విధులకు గైర్హాజరవుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా మండలస్థాయి అధికారుల పర్యవేక్షణ కరువవుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. కొందరైతే అలా రావడం..ఇలా వెళ్లడం జరుగుతోందని వారిని ప్రశ్నించే వారే లేకుండా పోయారని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు నింబగల్లు సచివాలయంలో సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సి ఉంది.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

**గుంతకల్లు, జూన్ 28 ప్రభాతవార్త**

ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం శనివారం పరిటాల రవి కల్యాణ మండపంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నియోజకవర్గం వ్యాప్తంగా 16వ విడతలో 23 మందికి గాను 21.64 లక్షలు మంజూరయ్యాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకతీతంగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందించడం జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## కుక్కలు, కోతుల బెడదను నివారించండి

**గుత్తి, జూన్ 28 ప్రభాతవార్త**



మున్సిపల్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు ప్రాణాంతకంగా పరిణమించిన కుక్కలు, కోతుల బెడద నివారించాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నూర్‌బీ అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోడ్లు గుంతలమయం అయ్యాయని కనీసం వాటిని పునరుద్ధరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫాగింగ్ మిషన్లను పంపిణీ చేసినా అధికారులు వాటిని వినియోగించడం లేదని ఆరోపించారు. ఈ మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌బాషా మాట్లాడుతూ కుక్కల నివారణకు ప్రభుత్వం ద్వారా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని ఆదేశాలు వచ్చాయని త్వరలో చేపడతామన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ యంత్రాలను వినియోగిస్తామన్నారు.. అనంతరం రెండు కోట్ల రూపాయల అంచనాతో నిర్మించనున్న భవన నిర్మాణం ప్లానింగ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## గేట్స్ విద్యార్థులకు రూ.22 లక్షల ఎంఎస్‌ఎంఈ ఫండింగ్

**గుత్తి, జూన్ 28 ప్రభాతవార్త**

యువ ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకై వారి ఆలోచనలను వాస్తవ ప్రపంచ పరిష్కారాలుగా మార్చేందుకై ప్రభుత్వం చేపట్టిన ఎంఎస్‌ఎంఈ ఐడియా హకతాన్ 4.0కు గేట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఇరువురు విద్యార్థులు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా 488 మంది ఎంపిక కాగా మన రాష్ట్రంలో కేవలం 47 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఇందులో భాగంగా గేట్స్‌కు చెందిన తిలక్‌మనీసాయి, నసీంఖయ్యూంలు ఎంపికయ్యారు. వీరు సమర్పించిన పేపర్ రీసైక్లింగ్, ఏటీఎం అండ్ ఎకోవారియర్, ఏఐ పవర్ బయో ఇన్‌స్పైర్ వేస్ట్ వేల రేజేషన్ ప్లాట్‌ఫామ్ ఫర్ సర్కులర్ ఎకానమీ అన్న అంశానికి గాను వీరికి 22 లక్షల రూపాయలు ఫెలోషిప్ లభించింది. దీంతో కళాశాల కరస్పాండెంట్ వికె పద్మావతి, చైర్మన్ రఘునాథరెడ్డి, డైరెక్టర్ వారి, అధ్యాపక బృందం వారిని ప్రశంసించారు.

# పారదర్శకంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త

సచివాలయ ఉద్యోగుల బదిలీలు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సచివాలయ ఉద్యోగుల బదిలీలపై ఆయా శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వ నిబంధనల ప్రకారం కౌన్సిలింగ్ ద్వారా చేపట్టాలన్నారు. రేషనలైజేషన్ ప్రకారం సచివాలయం వారిగా బదిలీలు చేపట్టాలన్నారు. నకిలీ సర్టిఫికెట్లు తీసుకువస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని, సొంత మండలానికి ఇవ్వడానికి వీలు లేదన్నారు. ప్రశాంతంగా, ఎలాంటి సమస్య లేకుండా సచివాలయ ఉద్యోగుల బదిలీలను నిర్వహించాలని ఆయా శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ ఏ.మలోల, నగరపాలక సంస్థ కమీషనర్ బాలస్వామి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్, డిఎస్‌పి మహబూబ్‌బాషా, డిపిఓ నాగరాజునాయుడు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ, సర్వే ఏడి రూప్లానాయక్, హార్టికల్చర్ డిడి ఉమాదేవి, పిఆర్ ఎస్ఇ జహీర్‌అస్లాం పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారంగా ప్లేస్ ఇవ్వడం లేదని వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆందోళన

మొదటిపేజీ తరువాయి....

3వ నెంబర్ లో ఉన్న అనంతపురం రూరల్ మండలం ఏ. నారాయణపురం సచివాలయంలో పనిచేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ షణ్ముఖ రెడ్డి స్పౌజ్ ( భార్య అక్కంపల్లి సచివాలయంలో పనిచేస్తుంది) పాయింట్ల కింద అనంతపురం రూరల్ మండలం నరసనాయన కుంట, సోముల దొడ్డి, కురుగుంట సచివాలయం కు బదిలీ చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయన ఇచ్చిన ఆప్షన్లు ఖాళీలు లేవని, గార్లదిన్నె మండలంలో ప్లేస్ తీసుకోవాలని డీడీ రామాంజనేయులు చెప్పడం జరిగింది. అందుకు ఆ వెల్ఫేర్ అసిస్టెంట్ తాను స్పౌజ్ పాయింట్లు ద్వారా మూడు స్థానాలకు బదిలీ చేయాలని ఆప్షన్ ఇచ్చానని, ఆ మూడు స్థానాలు ఖాళీలు లేవని చెప్పడం సరైనది కాదని, తనకు అనంతపురం మండలంలోని మరో రెండు స్థానాల్లో ఏదో ఒకటి కేటాయించాలని డిమాండ్ చేశారు. స్పౌజ్ కు అర్థం 20 కిలోమీటర్లు దూరంలో ప్లేస్ తీసుకోవాలని, ఆప్షను మేము ఇచ్చింది తీసుకోవాలని డీడీ హుకుం జారీ చేశారు. అప్పుడు వెల్ఫేర్ అసిస్టెంట్లు కౌన్సిలింగ్ ప్రక్రియను బాయికాట్ చేశారు. మధ్యాహ్నం 2:40 గంటల నుండి కౌన్సిలింగ్ ప్రక్రియను బాయికాట్ చేసి సాయంత్రం 6 గంటల వరకు ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత అక్కడ నుండి కలెక్టరేట్ కు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు.

### సిఫారసు లేఖలకే ప్రాధాన్యత

ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా జరగాల్సిన వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల ప్రక్రియలో కొందరు ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలకు అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారని, అందువల్ల తమకు మంచి స్థానాలు రాకుండా నష్టపోతున్నామని పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటప్పుడు ఇక బదిలీల కౌన్సిలింగ్ ఎందుకు నిర్వహిస్తారని అధికారులో స్వయంగా ప్లేసులు నిర్ణయించి ఉత్తర్వులు ఇస్తే సరిపోతుందికదా అని అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

### డీడీపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ఇతర శాఖల్లో సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను ప్రభుత్వ నిబంధనలను ప్రకారంగా, పారదర్శకంగా, పవర్ పాయింట్ స్క్రీన్ ద్వారా నిర్వహిస్తున్నారని, అయితే సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామాంజనేయులు వెల్ఫేర్ అసిస్టెంట్ల బదిలీల కౌన్సిలింగ్ ప్రక్రియలో చాలా మండలాల్లో ఖాళీగా ఉన్న దగ్గర ప్లేస్‌లను బ్లాక్ చేశారని, ఆఖరికి తాము బదిలీ దరఖుస్తులో ఇచ్చిన ప్లేస్‌లు కేడా చూపకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, సిఫారసు లేఖలకు ప్రాధాన్యత ఇస్తూ కౌన్సిలింగ్ ప్రక్రియను ఇష్టానుసారంగా , అర్హులకు మంచి స్థానాలు రాకుండా అన్యాయం చేస్తున్న డీడీ పై చర్యలు తీసుకొని, ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా బదిలీల కౌన్సిలింగ్ నిర్వహించాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని వెల్ఫేర్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు సాయినాథ్ రెడ్డి కలెక్టర్ ను కోరారు. ఇందుకు జిల్లా కలెక్టర్ స్పందించి వెల్ఫేర్ అసిస్టెంట్ల కౌన్సిలింగ్ ప్రక్రియను ప్రభుత్వ నిబంధనల ప్రకారంగా , పారదర్శకంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### నేటికి కౌన్సిలింగ్ వాయిదా

వెల్ఫేర్ అసిస్టెంట్ల కౌన్సిలింగ్ ప్రక్రియను ఆదివారంకు వాయిదా వేశామని, ఉదయం 8 గంటల నుండి ఎక్కడి నుండి ఆగిందో అక్కడి నుండి కౌన్సిలింగ్ ప్రారంభిస్తామని డీడీ రామాంజనేయులు తెలిపారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కౌన్సిలింగ్ ప్రక్రియను నిర్వహిస్తే మళ్లీ కూడా కౌన్సిలింగ్‌ను బాయికాట్ చేస్తామని వెల్ఫేర్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు సాయినాథ్ రెడ్డి తెలిపారు. అయితే ఇలాంటి పరిస్థితుల్లో కౌన్సిలింగ్ జరుగుతుందా..? లేదా..? అన్నది ఉత్కంఠగా మారింది.

# కలెక్టరేట్‌లో బదిలీ అయిన జిల్లా అధికారులకు ఆత్మీయ వీడ్కోలు

మొదటిపేజీ తరువాయి....

అలానే వెళతారని, వెళ్లిపోయేటప్పుడు జిల్లా అధికారులకు ఒక రిలేషన్ షిప్ ఉంటుందన్నారు. బదిలీ అయినప్పుడు కూడా ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించాలని అనుకుని ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. జిల్లా అధికారి అంటే సంపూర్ణమైన బాధ్యతని, జిల్లా యంత్రాంగంలో పని చేయాలంటే మీలో ఆ నాణ్యత ఉంటుందన్నారు. ఇక్కడ వచ్చాక రకరకాల అనుభవాలు ఉంటాయని, మెమోరీలు ఉంటాయన్నారు. జిల్లా యంత్రాంగంలో ప్రతి అధికారి ముఖ్యమైనవారన్నారు. జిల్లా నుంచి 17 మంది బదిలీ అయిపోతున్నారని, కొంతమంది ఉత్తమ అధికారులు ఉన్నారని, వారి సేవలను కొనియాడారు. ఎక్కడ పని చేసినా సంతోషంగా పని చేయాలని, పైఅధికారులు కింది స్థాయి అధికారుల గురించి నమ్మకంతో ఉండాలన్నారు. బదిలీపై వెళ్లిన జిల్లా అధికారులు బాగా పనిచేశారని, వారందరికీ అభినందలు తెలిపారు. బదిలీపై వెళ్లిన జిల్లా అధికారులు ఒక్కొక్కరి గురించి, వారి సేవలు గురించి జిల్లా కలెక్టర్ గుర్తు చేసుకుని కొనియాడారు. ఈ సందర్భంగా డిఆర్‌ఓ ఏ.మాలోల మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన జిల్లా అధికారులకు జిల్లా యంత్రాంగం తరఫున హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బదిలీపై వెళ్లిన జిల్లా అధికారులను చిరు జ్ఞాపిక అందించి శాలువా కప్పి జిల్లా కలెక్టర్ సన్మానించారు. అనంతరం అందరితో గ్రూప్ ఫోటో దిగారు. ఈ కార్యక్రమంలో సిపిఓ అశోక్ కుమార్, డ్రగ్స్ ఎడి వీరకుమార్ రెడ్డి, డిసిఓ అరుణకుమారి, డిఎండబ్ల్యూఓ రామసుబ్బారెడ్డి, డిఈఓ ప్రసాద్ బాబు, ఏపీఎంఐపి పిడి రఘునాథరెడ్డి, బిసి వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, డిఎస్‌ఓ వెంకటేశ్వర్లు, బదిలీ అయిన అధికారులు డ్రగ్స్ ఎడి రమేష్ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డిడి రాధిక, డిఐపిఆర్‌ఓ గురుస్వామి శెట్టి, ఏపిఐఐసి జెడ్‌ఎం సోనీ, హ్యాండ్ లూమ్స్ టెక్స్టైల్స్ అసిస్టెంట్ డైరెక్టర్ పోసిన శ్రీనివాస్ రెడ్డి, ఆర్కియాలజీ ఎడి రజిత, అడల్ట్ ఎడ్యుకేషన్ డిడి ఆంజనేయులు, ఉపాధి కల్పన అధికారి ఏ.కల్యాణి, కలెక్టరేట్ ఏఓ అలెగ్జాండర్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత

# ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నాం

-టిడిపి జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్, ఏపి రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వెంకటశివుడుయాదవ్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త

వైసిపి ఉనికిని కాపాడుకోవడానికే కూటమి ప్రభుత్వంపై అవాకులు చవాకులు మాట్లాడుతున్నారని, స్కాంలు బయట పడడంతో డైవర్షన్ చేయడానికే సజ్జల రామకృష్ణారెడ్డి మా పార్టీ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేశారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, ఏపి రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, ఏపి రాష్ట్ర కార్యదర్శులు జి.అదెన్న, తలారి ఆదినారాయణ, మాజీ గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గౌస్‌మో ద్దీన్, ఏపి రాష్ట్ర కురుబ సాధికార సమితి సభ్యులు కురుబ నారాయణస్వామిలు విమర్శించారు. అనంతపురంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఇచ్చిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు తెలుసుకొని మాట్లాడాలన్నారు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా తల్లికి వందనం ఎంతమంది పిల్లలు వుంటే అందరికీ అందచేశామన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కూడా జూలై మొదటి వారం నుండి అమలు చేస్తున్నామని, పింఛన్ల పెంపు. నెలకు 64 లక్షల మందికి నెలకు 2720 కోట్లు పంపిణీ. 16,347 పోస్టులతో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి మొదటి సంతకం తోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నా రన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు పథకం, దీపం-2 కింద 3 సిలిండర్లు ఉచితం. ఈ పథకం కోసం ప్రభుత్వం ఏడాదికి 2684 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు చేశాం. అధికారంలోకి రాగానే రోడ్లపై గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టి ఇప్పటికే 1200 కోట్లు ఖర్చు చేసి 20 వేల కి.మీ రోడ్లు బాగు చేయడం జరిగిందన్నారు. మత్స్యకారుల సేవలో పథకం ద్వారా 20 వేల ఆర్థిక సాయం కింద 259 కోట్లు ఇప్పటికే అందజేత. పోలీసులకు 213 కోట్ల సరెండర్ లీవ్ల సొమ్ము విడుదల. మహిళల రక్షణ కోసం శక్తి టీమ్స్ ఏర్పాటు. డ్రగ్స్, గంజాయి అరికట్టడానికి ఈగల్ విభాగం ఏర్పాటు నవజాత శిశువుల కోసం 11 వస్తువులతో ఎన్టీఆర్ బేబీ కిట్లు లక్ష మంది మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ. 70 వేల కోట్ల రైల్వే ప్రాజెక్టు పనుల్లో పురోగతి, 2245 కోట్లతో అమరావతికి 57 కి. మీ రైల్వే లైన్ మంజూరు. ఏడాదిలో సిఎంఆర్‌ఎఫ్ కింద 400 కోట్లు వివిధ వర్గాల వారికి అందచేయడం జరిగిందని వారు తెలిపారు.

# పిఎస్‌ఒలకు ఫైరింగ్‌పై తర్ఫీదు



ఫైరింగ్ శిక్షణ ఇస్తున్న దృశ్యం

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త

జిల్లా ఎస్‌పి పి.జగదీష్ ఆదేశాల మేరకు పిఎస్‌ఒలకు, గన్‌మేన్లకు నిర్వహిస్తున్న రిఫ్రెష్ కోర్సులో భాగంగా శనివారం మన్నీల ఫైరింగ్ రేంజ్‌లో ఫైరింగ్‌పై ప్రాక్టీస్ చేయించి తర్ఫీదునిచ్చారు. ఏఆర్ డిఎస్‌పి నీలకంఠేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐలు బాబ్జాన్, మగ్బూల్, పలువురు పిఎస్‌ఒలు పాల్గొన్నారు.

# పిడిఎస్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్న దృశ్యం

అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త

అనంతపురం ప్రాంతీయ నిఘా అధికారి వైబిపిటిఏ ప్రసాద్ ఆదేశాల మేరకు శనివారం రెవిన్యూ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు సోమలదొడ్డి గ్రామం వద్ద వాహనాన్ని తనిఖీ చేసి కర్ణాటక రాష్ట్రానికి అక్రమ రవాణా చేస్తున్న 99.00 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యంతో పాటు ఐచర్ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఈసీ యాక్ట్,1955 నిబంధనల మేరకు చట్టపరమైన చర్యల నిమిత్తం సిఎస్‌డిటి బి.మహబూబ్‌బాష అనంతపురం మండల తహశీల్దార్ కార్యాలయానికి స్వాధీనపరిచారు. నిందితులు డ్రైవర్ బి.శంకర్, బియ్యం యజమాని రాజశేఖర్‌లపై అనంతపురం రూరల్ పోలీసుస్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సిఐ కె.శ్రీనివాసులు, ఏఈఈఎల్ రవీంద్రనాథ్, సిఎస్‌డిటి బి.మహబూబ్‌బాష, అనంతపురం మండలం రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్దే ధ్యేయంగా కృషి చేద్దాం



మాట్లాడుతున్న విశాల ఫెర్రర్



కార్యక్రమానికి హాజరైన వారు

కూడేరు, జూన్ 28 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని స్థానిక భగవతి ఫంక్షన్ హాల్లో శనివారం రోజున ఎస్విఎఫ్ మహిళా కో ఆపరేటివ్ బ్యాంకు యొక్క రెండవ వార్షికోత్సవ మహసభ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్డీటి సంస్థ ఉమెన్ డైరెక్టర్ శ్రీమతి విశాలఫెర్రర్, చార్టెడ్ అకౌంటెంట్ రష్మీఆయన్నూర్, ఆర్డీటీ డైరెక్టర్ నిరంజన్, రీజనల్ డైరెక్టర్ కృష్ణవేణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశాలఫెర్రర్ మాట్లాడుతూ.. మహిళా బ్యాంకులు మహిళలు ఆర్థికాభివృద్ధి కోసమే స్థాపించబడిందని ముఖ్యంగా మహిళల ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడానికి మరియు పెంపొందించడానికి వారి అవసరాలకు తగినట్లుగా ఆర్థిక సేవలను అందించడానికి బ్యాంకు కృషి చేస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా కృషి చేయాలన్నారు. మహిళలు బ్యాంకులో రుణాలు తీసుకొని వాటిని సక్రమంగా వినియోగించుకుని తిరిగి నెలవారీ కంతులు సక్రమంగా చెల్లించడంతోనే బ్యాంకు అభివృద్ధి చెందుతుంది. మనం కూడా అభివృద్ధి పథంలో నడుస్తున్నామన్నారు. మహిళా కో ఆపరేటివ్ బ్యాంకు అందరి సహకారంతో రెండవ వార్షికోత్సవ మహసభ జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని బ్యాంకు ఇంకా ఇంకా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీఎల్ నల్లపరెడ్డి, అకౌంటెంట్ వెంకటేశులు, సీఓ రామాంజనేయులు, కూడేరు సర్పంచ్ లలితమ్మ, బోర్డు ఆఫ్ డైరెక్టర్స్, బ్యాంకు సిబ్బంది, వివిధ గ్రామాల మహిళలు పాల్గొన్నారు.

# కస్తూరి గాంధీ జూనియర్ కళాశాల వసతి గృహాల నిర్మాణానికి భూమి పూజ



వసతి గృహాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం రూరల్, జూన్ 28 ప్రభాతవార్త

అనంతరం మండలం కురుగుంట గ్రామ పంచాయతీలో గల కస్తూరి గాంధీ విద్యాలయం బాలికల జూనియర్ కళాశాల వసతి గృహాల నిర్మాణం కోసం రాప్తాడు శాసనసభ్యులు పరిటాల సునీతమ్మ 1, కోటి 25, లక్షలు రూపాయలు మంజూరు చేయడంతో శనివారం కురుగుంట కస్తూరి గాంధీ విద్యాలయం బాలికల జూనియర్ కళాశాలలో భూమి పూజకార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్,జింకా సూర్యనారాయణ, మాజీ జెడ్పిటిసి మేకల వేణుగోపాల్ మాజీ కన్వీనర్లు వెంకటేష్ కురుగుంట లక్ష్మీనారాయణ, క్లస్టర్ అధ్యక్షుడు రాగే మురళి,మండల తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# 30న పంచాయతీరాజ్ శాఖలోని సమస్యలపై కలెక్టరుకు వినతి పత్రం అందజేత

పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం యస్ యస్ సాదిక్ వలి.



సాదిక్ వలి

అనంతపురం రూరల్, జూన్ 28

ఈ నెల 30న పంచాయతీరాజ్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రం అందజేయడం జరుగుతుందని పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం.యస్.యస్.సాదిక్‌వలి తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేయించాలని, ఎన్.ఆర్.ఈ. జీ.ఎస్. చట్టం మేరకు ఉపాధి హామీ పనులు గ్రామ పంచాయితీల ద్వారానే జరిపించాలి కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లించాలని,సర్పంచులకు తల్లికి వందనం పథకాన్ని తక్షణమే వర్తింపచేయాలని, కేంద్రం విడుదల చేసిన, 15వ ఫైనాన్స్ కమిషన్ విడుదల చేసిన నిధులు 1,150 కోట్లు స్థానిక సంస్థలకు తక్షణమే జమచేయాలి. ఈ బిల్లుల చెల్లింపుల్లో రాజకీయ జోక్యం నివారించాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 73,74 సవరణల మేరకు సర్పంచులకు ఉన్న అధికారాలను అమలుచేయాలని, జీఓ ఎం.ఎస్.నెం.11 ని రద్దుపరిచి గాలిలో ఉన్న 1,350 మంది పంచాయితీ సెక్రటరీలకు పోస్టంగులు ఇచ్చి, 10 నెలలుగా పెండింగులో ఉన్న జీతాలను విడుదల చేయాలన్నారు. కూటమి ప్రభుత్వ హామీ మేరకు, గ్రామాల్లో వసూలు చేస్తున్న ఇంటి పన్నులను స్థానిక సంస్థల ఖాతాల్లో జమచేయాలన్నారు.సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీలకు వేతనాలు వెంటనే పెంచి ప్రస్తుతం అమలులో ఉన్నవేతనాలను సకాలంలోచెల్లించాలన్నారు.

# వైకాపా నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఆంజనేయులు

బుక్కరాయసముద్రం జూన్ 28 ప్రభాతవార్త



మంత్రి ఆంజనేయులు

శింగనమల నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బుక్కరాయసముద్రం మండలం వడియంపేట గ్రామానికి చెందిన మంత్రి ఆంజనేయులు అలియాస్ అంజి నియమించారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ శింగనమల నియోజకవర్గంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. నాకు ఈ పదవి రావడానికి కృషిచేసిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# వైకాపా ఎస్సీసెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా కాటమయ్య

బుక్కరాయసముద్రం జూన్ 28 ప్రభాతవార్త



శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త శైలజనాథ్‌ను సన్మానిస్తున్న కాటమయ్య

అనంతపురం జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీగా బుక్కరాయసముద్రం మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన వరికూటి కాటమయ్య నియమించడం జరిగినది. ఈ సందర్భంగ కాటమయ్య మాట్లడుతూ నన్నునమ్మి ఇంతటి పెద్ద బాధ్యత ఇచ్చినందుకు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి కి అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి,శింగనమల నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్, వైయస్సార్ పార్టీ రాష్ట్ర ఎన్ఆర్ఐ కో కన్వీనర్ ఆలూరు సాంబశివారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలపడం జరిగినది.ఈ కార్యక్రమంలో వరికూటి కాటమయ్య తోపాటు బండారు చిన్నా,నాగమణి, సాకే రామచంద్ర,ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్,సత్తి, గోపి, ఉదయ్,మెహన్‌బాబు, భరత్ తదితిరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

- వైఎస్ఆర్‌సిపి మహిళా విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి లలితా కళ్యాణి





ఆలూరు సాంబశివారెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్‌కి పూల బొకేను ఇస్తున్న బండి లలితా కళ్యాణి దంపతులు

శింగనమల, జూన్ 28 ప్రభాతవార్త

రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, ఇటీవల వైఎస్ఆర్‌సిపి మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన బండి లలితా కళ్యాణి పేర్కొన్నారు. ఆమె శనివారం వైఎస్ఆర్‌సిపి ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డిని నియోజకవర్గ సమన్వయ కర్త దాసాకే శైలజానాథ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, పూల బొకేను అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తనకు రాష్ట్ర కమిటీలో అవకాశం ఇచ్చినందుకు ఎంతో సంతోషంగా ఉందని పార్టీకి ఎల్లప్పుడు అందుబాటులో ఉండి, పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని ఆమె పేర్కొన్నారు. తన నియామకం ద్వారా నియోజకవర్గానికి మరోసారి అరుదైన గుర్తింపు లభించిందుకు, మహిళల ప్రతిభకు వైఎస్ఆర్‌సిపి అందిస్తున్నప్రోత్సాహకానికి ఇది నిదర్శనమన్నారు.

# ప్రజాభ్యున్నతికి పాటుపడండి

- తహశీల్దార్ షర్మిలను కలిసిన జనసేనపార్టీ అధ్యక్షులు ధనుంజయ



తహశీల్దార్ షర్మిలకు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసైనికులు

పామిడి, జూన్ 28 ప్రభాతవార్త

ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా ప్రజాభ్యున్నతికి పాటుపడాలని జనసేనపార్టీ అధ్యక్షులు ధనుంజయ తహశీల్దార్ షర్మిలను కోరారు. ఇటీవల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన షర్మిలను శనివారం జనసేనపార్టీ అధ్యక్షులు ధనుంజయ, జనసైనికులు కలిసి మొక్కను అందజేసి శుభాకాంక్షలను తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూనే అందరికీ న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులంతా సమన్వయంతో అభివృద్దే లక్ష్యంగా ముందుకెళ్ళాలని ఈక్రమంలో మావంతు సహకారాన్ని అందజేస్తామని జనసేనపార్టీ అధ్యక్షులు ధనుంజయ తెలియజేశారు. స్పందించిన తహశీల్దార్ షర్మిల అందరి సహకారంతో అన్నివర్గాల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతూ ముందుకు సాగుతామని వెల్లడించారు. ఈకార్యక్రమంలో జనసేనపార్టీ నాయకులు శ్రీనివాసులు, వేణుగోపాల్, పెన్న ఓబులేసు, నక్కల రామాంజనేయులు, ప్రతాప్, లక్ష్మన్న, చలపతి, అఫ్జల్, జగదీష్, నభీరసూల్, బాబావలి, నవీన్, చంద్రబాబు, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సహకార సొసైటీలకు కమిటీలు ఏర్పాటుకు సన్నాహాలు

అనంతపురం వైద్యం జూన్ 28 ప్రభాతవార్త

అనంతపురం జిల్లాలోని ఏడీసీసీ బ్యాంకుకు అనుబంధంగా ఉన్న 17 సొసైటీలకు ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు సమాచారం.సొసైటీ చైర్మన్, ఇద్దరు డైరెక్టర్ల నియామకం కోసం రాష్ట్ర సహకార శాఖా కార్యాలయం నుండి జిల్లా సహకార అధికారి కార్యాలయానికి వ్యక్తుల పేర్లు సూచించాలని ఉత్తర్వులు అందాయి .దీంతో సహకార శాఖ అధికారులు పేర్లు వెతికే పనిలో పడ్డారు. అనంతపురం జిల్లాకు సంబంధించి 58 సొసైటీలు ఉండగా వాటిలో కేవలం 17 సొసైటీలకు మాత్రమే కమిటీ సభ్యులు నియమించడం కొంత గందరగోళానికి దారితీస్తుంది జిల్లాలో చాలా సొసైటీలు నష్టాల బాటలో నడుస్తున్న కారణంగా తొలిత కొన్ని సొసైటీలకు కమిటీలను నియమించి వాటి పనితీరు మెరుగు పరచి మిగిలిన సొసైటీలకు సభ్యులను నియమించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. నష్టాల్లో ఉన్న సొసైటీలకు తమను నియమించి ఏం ప్రయోజనం అని తెలుగు తమ్ముళ్ల స్థానిక ప్రజాప్రతినిధుల వద్ద బాహాటంగా విమర్శిస్తుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.

# కొండూరు మసూద్ దంపతుల నిజాయితీ



నగదును అందజేస్తున్న కొండూరు మసూద్

శింగనమల, జూన్ 28 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని బిసి కాలనీకి చెందిన బోయ కొండూరు మసూద్ దంపతులు ఇతరులకు చెందిన డబ్బులు తమ అకౌంట్‌లోకి జమా కావడంతో తిరిగి వారికి అందజేసి వారి నిజాయితీని చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకుమారుడు 9వ తరగతి, కూతురు కె.చంద్రకళ 10వ తరగతి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో చదువుతున్నారని, అదే విధంగా మండల కేంద్రానికి చెందిన మర్తాడు మణియమ్మ, చెంద్రాయుడు కూతురు కె.చంద్రకళ అదే పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన తల్లికి వందనం పథకం డబ్బులు 13వేలు మర్తాడు మణియమ్మ కూతురు చంద్రకళకు చెందిన 13వేలు కొండూరు సావిత్రి పోస్టాఫీసు ఖాతాలో జమ కావడంతో విషయం తెలిసిన వెంటనే కొండు మసూదు, సావిత్రి దంపతులు శనివారం పోస్టాఫీస్ ఖాతా నుంచి నగదును విత్‌డ్రా చేసి గ్రామ సచివాలయంలో విఆర్‌ఓ తాతయ్య ఆధ్వర్యంలో మర్తాడు మణియమ్మకు నగదును అందజేశారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు కొండూరు మసూదు దంపతులను అభినందించారు. ఈ కార్యక్రమం లో సచివాలయ మహిళ పోలీస్ శిల్పా, పోస్టాఫీస్ ఉద్యోగి నబి పాల్గొన్నారు.

# వివాదం రేకెత్తించిన విచారణ

మొదటిపేజీ తరువాయి....



పోలీసులు చితకబాదారంటున్న బాధితుడు



ఎస్సై నాగేంద్ర ప్రసాద్



ఏఎస్పీ రోహిత్ కుమార్ చౌదరి

హేమంత్‌కు సంబంధించిన హిస్టాగ్రామ్‌ను చూసి అతను ఎక్కడున్నాడో చెప్పాలంటూ పోలీసులు చితకబాదారు. హిస్టాగ్రామ్‌లోఉన్నంత మాత్రాన అతని కదలికలు నాకెలా తెలుస్తాయని వేడుకున్నా వినకుండా పెద్దపప్పూరు పోలీసులు తమ దాష్టీకాన్ని ప్రదర్శించారు.హేమంత్ ఫోన్ నంబరు మా కొడుకు చరవాణిలో ఉన్నంత మాత్రాన అతని సమాచారం మా కుమారునికి ఎలా తెలుస్తుందని, తనకు తెలియదని చెబుతున్నా పోలీసులు వినిపించుకోకుండా తమ కుమారున్ని పోలీసులు చితకబాదారని వంశీకృష్ణ తండ్రి వాపోయాడు. దీంతో బాధిత యువకుడు తన తండ్రికతో కలసి మీడియాను ఆశ్రయించాడు. దీంతో పోలీసుల దాష్టీకం బహిర్గతమైంది. సామాజిక మాధ్యమాల్లో పోలీసుల వైఖరి చక్కర్లు కొట్టడంతో స్పందించిన జిల్లా ఎస్పీ జగదీష్ ఈ సంఘటన తీరుపై విచారించి నివేదికసమర్పించవలసిందిగా తాడిపత్రి సబ్‌డివిజన్ పోలీసు అధికారి ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరిని ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగాతగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు. అదృశ్యమైన జంటకు సంబంధించిన కుటుంబ సభ్యులపై విచారించాల్సిన పోలీసులుఇలా స్నేహితులను విచారణకు పిలిచి తీవ్రంగా కొట్టడంపై మండల వ్యాప్తంగా విమర్శలు వ్యక్తమయ్యాయి. అయితే వంశీకృష్ణకు అయినగాయాలు మేకలను మేపడానికి వెళ్లి కిందపడటం వల్ల అయినట్లు బాధిత యువకునితో మరో వీడియో చిత్రీకరించి స్థానిక నాయకులువిడుదల చేసి పోలీసులను కాపాడే ప్రయత్నం చేసినట్లు మరోవైపు ఆరోపణలు వ్యక్తమయ్యాయి. మొత్తానికి బాలిక అదృశ్యం కేసు విచారణ వివాదాస్పదంగా మారడం పోలీసు వర్గాల్లోనూ చర్చకు దారితీసింది.

### విచారించామే తప్ప కొట్టలేదు రామసుబ్బయ్య, సీఐ, పెద్దపప్పూరు.

పెద్దపప్పూరు స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలిక అదృశ్యంపై నమోదైన కేసు విషయంలో వంశీకృష్ణను కేవలం విచారించామే తప్ప పోలీసులెవరూ కొట్టలేదు. దర్యాప్తులో భాగంగా పలువురు అనుమానితులను విచారించామని, అందులో భాగంగా వంశీని కూడా విచారించామే తప్ప పోలీసులు చితకబాదారనడం అవాస్తవం.

## ప్రతి ఇంటిపై సోలార్‌తో.. విద్యుత్ బిల్లును ఆదా చేసుకోండి..

- పీఎం సూర్య ఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోండి..
- రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సునీత పిలుపు..
- పథకంపై విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష..
- క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే ఆదేశం..



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, జూన్ 28 ప్రభాతవార్త బ్యూరో**

ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకుని విద్యుత్ బిల్లులను తగ్గించుకోవాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రజలకు సూచించారు. ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై ఆమె విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శ్రీ సత్యసాయి జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్‌తో పాటు ఇతర అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన పథకంపై గృహ వినియోగదారులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. సోలార్ ప్యానెళ్లను అమర్చుకోవడానికి అనువైన పైకప్పు ఉన్న ఇళ్లను గుర్తించాలన్నారు. గృహాలతో పాటు ప్రభుత్వ భవనాలు, పాఠశాలలు, కళాశాలలు తదితర వాటిపై సోలార్ రూఫ్ టాప్‌లు ఏర్పాటు చేసుకుంటే కలిగే ప్రయోజనాల గురించి వివరించాలన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. విద్యుత్ ఛార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రాయితీని పొంది ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ నిర్మించుకోవచ్చునన్నారు. కనీసం పది చదరపు మీటర్లు లేదా వంద చదరపు అడుగుల స్థలంలో ఒక కిలో వాట్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. నెలకు 120 యూనిట్ల విద్యుత్తును వినియోగిస్తే రూ.1000కి పైగా బిల్లు వస్తోందని.. అయితే సోలార్ రూఫ్‌టాప్‌తో రూ.338కి ఖర్చు తగ్గించుకోవచ్చన్నారు. పీఎం సూర్యఘర్ యోజన కింద 2 కిలోవాట్ సామర్థ్యం గల సిస్టమ్‌లకు సోలార్ యూనిట్ ధరలో 60 శాతం, 2 నుంచి 3 కిలోవాట్ సామర్థ్యం సిస్టమ్‌లకు అదనపు సిస్టమ్ ఖర్చులో 40 శాతం సబ్సిడీని, 3 కిలోవాట్ వరకూ రూ.78 వేల వరకూ కేంద్ర ప్రభుత్వం రాయితీగా అందిస్తుందన్నారు. ఈ పద్ధతిలో ఇంటి పైకప్పు నుంచే విద్యుదుత్పత్తి చేసుకోవచ్చని, ఇంటి అవసరాలు తీరిన తర్వాత మిగిలిన విద్యుత్తుతో అదనపు ఆదాయం పొందే అవకాశం లేకపోలేదన్నారు. దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, త్వరలోనే నియోజకవర్గంలో మండలాల వారిగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే సునీత తెలియజేశారు.

## రైతు సంక్షేమమే చంద్రబాబు లక్ష్యం



విత్తన పంపిణీలో మాట్లాడుతున్న కాల్వ శ్రీనివాసులు

**రాయదుర్గం జూన్ 28 ప్రభాతవార్త**

రైతు సంక్షేమమే చంద్రబాబు లక్ష్యమని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. గుమ్మ గట్ట మండలం పూలకుంట గ్రామంలో శనివారం జరిగిన ఉచిత కంది విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సాధారణంగా వేరుశనగలో అంతర్ పంటగా ఆముదం, కందిని ప్రతి 7సాల్లల్లో ఓ సాలు వేసుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఒకవేళ ఏదైనా కారణంతో పంట నష్టపోతే మరో పంట ద్వారా కనీసం పెట్టుబడి ఖర్చయినా దక్కుతుందన్న ఉద్దేశంతో రైతులు ఈ విధానాన్ని అనుసరిస్తారన్నారు. కంది సాగును ప్రోత్స హించాలన్నే ఉద్దేశంతో ప్రతి రైతుకు నాలుగు కిలోలు చొప్పున కంది విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని ముఖ్య మంత్రి నిర్ణయించారన్నారు. ప్రస్తుత సీజన్లో అనంత పురం జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.1.07కోట్ల, రాయ దుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.11.90 లక్షల విలువైన విత్తన కందులు పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని రైతులు సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది మంచి పంటలు పండించి అధిక దిగుబడితో ప్రతి రైతు లాభాలు గడించాలని ఆశాభావం వ్యక్తపరిచారు. రైతు కుటుంబాలు ఆనందంగా జీవించాలనే సంకల్పంతో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సబ్సిడీ పథకాలను తిరిగి ప్రారంభిస్తోందన్నారు. రైతుల ప్రయోజనం కోసం గత టీడీపీ ప్రభుత్వం వ్యవసాయ, అనుబంధ శాఖల ద్వారా 117 పథకాలను అమలు చేసిందని గుర్తు చేశారు. వైకాపా పాలనలో వాటన్నింటినీ నీరుగార్చారని ఆరోపించారు. అంతే కాకుండా రాష్ట్రంపై రూ.10లక్షల కోట్ల అప్పుల భారాన్ని మోపిందన్నారు. బయట ఎక్కడ అప్పులు కూడా పుట్టకుండా రాష్ట్రాన్ని దివాలా తీయించారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో... ప్రభుత్వాన్ని అభివృద్ధి వైపు నడిపించటం ఎంత కష్టమో అర్థం అవుతోందన్నారు. కూటమిపై విశ్వాసంతో గత ఎన్నికల్లో ప్రజలు అనూహ్య మెజార్టీ ఇచ్చారన్నారు. ఆ విశ్వాసాన్ని నిలుపుకోవడానికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కేంద్రం వద్ద తనకున్న పలుకుబడి, అనుభవంతో నిధులు తీసుకొచ్చి అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా ముందుకు తీసుకుపోతున్నారన్నారు. గ్రామాల్లో సీసీ రహదారులు గోకులం షెడ్లు ఏర్పాటు చేసుకొంటున్నామన్నారు. పాడి రైతులకు సబ్సిడీ పై పశుగ్రాసం అందచేయటం జరుగుతుందన్నారు. పల్లె ప్రాంతాల అభివృద్ధికి, ముఖ్యంగా రైతుల జీవితాల్లో వెలుగులు నింపటానికి గతంలో ఆగిపోయిన అనేక పథకాల అమలుకు చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి మీ అందరి ఆశీసులు ఎల్లవేళల ఉండాలని కోరారు. కార్యక్రమంలో రాయదుర్గం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ హనుమంత రెడ్డి, వైస్ ఛైర్మన్ దానవేంద్ర, కాలవ సన్నన్న వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఎవర్ని రీకాలింగ్ చేయాలో ప్రజలకు బాగా తెలుసు

- అందుకే మీకు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు
- వైసిపి రీకాలింగ్ మ్యానిఫెస్టో కార్యక్రమంపై ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందన
- మేము ఇచ్చిన హామీలు నెరవేర్చాం కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్తాం
- మీరు ప్రజల వద్దకు వెళితే వారే బుద్ధి చెబుతారు - ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

**అనంతపురం కలెక్టరేట్, జూన్ 28 ప్రభాతవార్త**

ఎవర్ని రీకాలింగ్ చేయాలి ఎవర్ని ఎక్కడుంచాలన్నది ప్రజలకు బాగా తెలుసునని అందుకే మీకు ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. వైసిపి నాయకులు చేపట్టిన రీకాలింగ్ మ్యాని ఫెస్టో కార్యక్రమంపై ఆయన తీవ్రంగా స్పందించారు. మేము ఎన్నికల ముందు ఏం హామీలు ఇచ్చాము ఏవి నెరవేరుస్తున్నామన్నది మాకు స్పష్టత వుందని అలాగే ప్రజలకు కూడా బాగా తెలుసునని ఎమ్మెల్యే కామెంట్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ఐదు సంతకాలు కీలకమైన హామీలు నెరవేర్చేలా చేశారన్నారు. ఇందులో మెగా డిఎస్సి, అన్న క్యాంటీ పునఃప్రారంభం, పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు వంటి వాటిని అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. జూన్ 12 నుండి తల్లికి వందనం పథకం కూడా అమలు చేస్తున్నామని, అలాగే అన్నదాత సుఖీభవ, ఆర్టీసి బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం వంటివి కూడా అమలు కాబోతున్నాయన్నారు. ఇవన్నీ తట్టుకోలేక రీకాలింగ్ అంటూ కొత్త నాటకాలకు వైసిపి నాయకులు తెర లేపారన్నారు. సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాభివృద్ధిని చూసి ఓర్వలేక ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. మేము ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం కాబట్టే ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామని అదే మీరు కుట్రలతో ప్రజల వద్దకు వెళ్తే వారే మీకు తగిన విధంగా బుద్ధి చెబుతారన్నారు. ఓ వైపు పరామర్శల పేరుతో జగన్‌రెడ్డి సొంత పార్టీ కార్యకర్తలను బలి తీసుకుంటున్నారని ఇంకోవైపు ఆ పార్టీ నాయకులు గతంలో చేసిన తప్పులకు వరుసగా జైలు బాట పడుతున్నారని దగ్గుపాటి విమర్శించారు. ప్రజల్లో రోజు రోజుకీ మరింత పలుచన అవుతున్నామనే భావనతో ప్రభుత్వంపై ఏదో ఒక దుష్ప్రచారం చేయాలనే ఉద్దేశ్యంతో రీకాల్ అంటున్నారన్నారు. ప్రజలు వీటిని తిప్పికొట్టాలని ఎమ్మెల్యే దగ్గుపాటి పిలుపునిచ్చారు.

## మాజీ సర్పంచ్ ని పరామర్శించి ఆర్థిక సాయం చేసిన మంత్రి సవిత



మాజీ సర్పంచ్ హనుమంత రాయుడుని పరామర్శిస్తున్న మంత్రి సవిత.

**రొద్దం. జూన్ 28 ప్రభాతవార్త.**

తెదేపా సీనియర్ లీడర్ ఆర్‌లో చర్ల గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కె హనుమంతరాయుడు అనారోగ్యంతో బాధపడుతుండగా మంత్రి సవిత హనుమంతరాయుని పరామర్శించి ఆర్థిక సాయం అందజేసింది హనుమంతరాయుడు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆర్ లో చర్ల గ్రామపంచాయతీ కన్వీనర్ మురళి బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దృష్టికి తీసుకుపోగా అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హనుమంతరాయుడు దగ్గరికి వెళ్లి పరామర్శించి ధైర్యంగా ఉండాలని ఎప్పుడూ ఏ కష్టం వచ్చినా నేను తెలుగుదేశం పార్టీ అండగా ఉంటామని భరోసా ఇచ్చి 60 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసింది ఈ కార్యక్రమంలో తెదేపా సీనియర్ లీడర్ మాధవ నాయుడు కన్వీనర్ నరహరి హనుమంతు ఆర్ లోచర్ల గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

-దేశంలో ఎక్కడా లేని విధంగా సూపర్ సిక్స్ పథకాలు
-దసరా కానుకగా పేదలకు పట్టాల పంపిణీ
-ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**గుంతకల్లు, జూన్ 28 ప్రభాతవార్త**

పేద ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాలన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం పట్టణంలోని పరిటాల రవి కళ్యాణ మండపంలో "సుపరిపాలనలో తొలిఅడుగు" కార్యక్రమం మండల అధ్యక్షులు బండారు రామన్నచౌదరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాజిక పెన్షన్లను 3 వేల నుండి 4 వేలకు ఒకేదఫా పెంచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ కింద రైతులకు 20 వేలు ఆర్థిక సాయం అందించబోతున్నామన్నారు. విద్యార్థులకు తల్లికి వందనం కింద 15 వేలు ఇచ్చి చరిత్ర సృష్టించామన్నారు. అలాగే ఆగస్టు 15న మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నట్లు తెలిపారు. వచ్చే దసరా పండుగ రోజున 500 మంది పేదలకు ఇంటి పట్టాల పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా 12 చెరువులకు నీరు అందించడానికి ముఖ్యమంత్రి హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కష్టపడిన వారికి కులాలకతీతంగా పార్టీ పదవులు కట్టబెట్టామన్న ఆయన స్థానిక ఎన్నికల్లో నాయకులను గెలిపించే బాధ్యతను తీసుకుంటానని భరోసా ఇచ్చారు. తన తమ్ముళ్లు పార్టీ కోసం పని చేస్తున్నారు తప్పా దోచుకోవడానికి రాజకీయాలు చేయట్లేదని పునరుద్ఘాటించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తలారి మస్తానప్ప, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, కెసి హరికుమార్, గుమ్మనూరు వెంకటేష్, గుజరీ మహమ్మద్‌ఖాజా, ఫజులు, అంజి, యుగంధర్‌చౌదరి, చిప్పగిరి ప్రతాప్, కృపాకర్, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం భయపడదు

- ప్రజాస్వామ్య బద్ధంగా వైసిపి అరాచకాల తాట తీయడమే ప్రభుత్వ లక్ష్యం
- రీ కాల్ చంద్రబాబు కాదు రీ సైక్లింగ్ చంద్రబాబు
- ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

**శింగనమల, జూన్ 28 ప్రభాతవార్త**

వైసిపి తాటాకు చప్పుళ్లకు కూటమి ప్రభుత్వం భయపడదు, ప్రజాస్వామ్య బద్దంగా వైసిపిఅరాచకాల తాట తీడయమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. శనివారం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పత్రికా ప్రకటన విడుదల చేస్తూ నియోజకవర్గ పరిధిలో వైసిపి నాయకులు బలప్రదర్శనగా పెట్టి సై అంటే సై అని మాట్లాడుతున్న రెచ్చగొట్టే వ్యాఖ్యలను ఖండించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రమాణ స్వీకారం రోజే పెన్షన్ల పెంపు చేశారని, గత వైసిపి ప్రభుత్వం పింఛన్ల డబ్బు పెంపుకు ఐదు సంవత్సరాల సమయం తీసుకుంటే కూటమి ప్రభుత్వం వెంటనే అమలు చేసిందన్నారు. గతంలో రైతులకు డ్రిప్ ఇరిగేషన్ సబ్సిడి గురించి పట్టించుకోకుండా రైతుల భూములను యజమానులకు తెలియకుండా భూ మార్పిడి చేసిన ఘనత వైసిపిదే అన్నారు. వైసిపి నాయకులు దౌర్జన్యాలు చేసి ప్రజలను వేదింపులకు గురి చేసిన విషయం ప్రజలు ఇంకా మర్చిపోలేదన్నారు. ఒక కుటుంబంలోని విద్యార్థులందరికీ అమ్మఒడి డబ్బులు ఇస్తామని మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకం కింద కుటుంబంలో ఎంత మంది చదివే పిల్లలు ఉంటే అందరికీ ఆర్థిక సాయం అందించి పిల్లల చదువులు, తల్లిదండ్రులకు భారం కాకుండా అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలిచిందని అన్నారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి మరణిస్తే మహిళలు వితంతు పింఛన్ల కోసం కన్నీళ్లతో ఎదురు చూసే పరిస్థితి ఉండేది. కానీ కూటమి ప్రభుత్వంలో పింఛన్ తీసుకుంటున్న వ్యక్తి మరణిస్తే మరో నెలలోనే వితంతు పింఛన్లు స్పౌజ్ కింద ఇవ్వడం జరుగుతోందన్నారు. ఐదేళ్లలో ఎలాంటి ఉద్యోగ భర్తీలు చేయకుండా కేవలం ఎన్నికల సమయంలో డిఎస్సీ అని ఉత్తుత్తి నోటిఫికేషన్‌తో నిరుద్యోగులను మభ్య పెట్టిందన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం మెగా డిఎస్సీని ప్రకటించి నిర్వహించిందన్నారు. పేద ప్రజలకు ఉచితంగా ఇసుకను రాష్ట్ర ప్రభుత్వం అందించి భవన నిర్మాణాల కార్మికులకు, ఉపాధి అవకాశాలు కల్పించిందన్నారు. సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అవినీతి రహితంగా అర్హులకు అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పాలనను ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలు అభినందిస్తున్నట్లు తెలిపారు. మా పరిపాలన సుభిక్షం, మీ పరిపాలన దుర్భిక్షం. మీ పరిపాలనలో అభివృద్ధి అధోపాతాళంలో.. మా పరిపాలనలో అభివృద్ధి వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. మీరు రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అంటున్నారు. మేము చేస్తున్నది రీ సైక్లింగ్ చంద్రబాబు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని అభివృద్ధివైపు తీసుకెళ్తున్నారని ఆమె పేర్కొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటికి కొలతలు

- ఐదు గంటలపాటు సాగిన ఇంటి కొలతలు

**తాడిపత్రిటౌన్, జూన్ 28 ప్రభాతవార్త**



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి వద్ద కొలతలు వేస్తున్న దృశ్యం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి కొలతలను మున్సిపల్ అధికారులు శనివారం చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపట్టారని మున్సిపల్ చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి గతంలో ఆరోపించిన విషయం విదితమే. ఈ విషయమై మున్సిపల్ అధికారులు పలుమార్లు నోటీసులు పంపినా స్పందించలేదని శనివారం పెద్దారెడ్డి ఇంటి కొలతలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు చేపట్టారు. సర్వే నంబర్ 639,640, 641, ఆర్ఒసి నెంబర్ 23357/182, ఎల్.పి నెంబర్ 151/1983, ప్లాట్ నెంబర్ 2 నుండి 15 వరకు 14 ప్లాట్లకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ సుజాత, టౌన్ సర్వేయర్ కైవల్యసాయి, మండల సర్వేయర్ రామ్మోహన్, మున్సిపల్ అధికారులు, పోలీసుల సమక్షంలో సర్వే నిర్వహించారు. ఈ సర్వే ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్లకు సంబంధించిన యజమానులతో సంప్రదించి సర్వే (కొలతలు) చేశారు. ఎల్పి నెంబర్ 151/83లో పొందుపరిచిన కొలతలు పరిశీలించగా ప్లాట్ నెంబర్ 2 మరియు 15 ఇంటి యజమాని కేతిరెడ్డి రమాదేవికి కేటాయించిన స్థలంను కాకుండా తూర్పు దిశన 14 అడుగులు, పడమర దిశన 2.5 అడుగులు ఆక్రమించారని మున్సిపల్ అధికారులు గుర్తించడమైనది, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి 2021 మార్చి 16 తేదీన తన ఇంటి ప్లాన్ మంజూరు కోసం 257.36 స్క్వేర్ మీటర్లు స్థలంలో ఇంటి నిర్మాణం చేపడతానని పర్మిట్ నెంబర్ 1007/0260/బి/టిఎంసి/బిహెచ్ఏ/ 2020గా డీమ్‌డ్ అప్రూవల్ పొందారు. కానీ ఆయన నిర్మాణం చేపట్టిన కొలతలు ఎక్కువగా వున్నాయని అప్పటి టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ ఆ ప్లాన్‌ను పెండింగ్లో వుంచడమైనది, ఈ విషయాన్ని ఇప్పటివరకు పెద్దారెడ్డికి తెలియదని మున్సిపల్ అధికారుల వద్ద వాపోయారు, అంటే స్థలం ఆక్రమణతో పాటు, ఇంటి నిర్మాణానికి కూడా ప్లాన్ అప్రూవల్ లేదని మున్సిపల్ అధికారులు గుర్తించడమైనది, అలాగే సెల్లార్లో నిర్మించిన 2.0 సెంట్ల (936 చదరపు అడుగులు) నిర్మాణం అనాథరైజుడు నిర్మాణం చేపట్టి వున్నారని తెలియచేశారు. ఈ కొలతలపై మున్సిపల్ అధికారులు అధికారికంగా ప్రకటించాల్సి వుంది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పట్టణ సిఐ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుబందోబస్తు ఏర్పాటు చేశారు.

## అత్యాధునిక సాంకేతికతతో నేరాలు కట్టడిచేయాలి.

- రాత్రి వేళల్లో గస్తీని పటిష్టం చేయాలి. - జిల్లా ఎస్పీ వి.రత్న





నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వి.రత్న, ప్రశంసా పత్రాలు అందిస్తున్న జిల్లా ఎస్పీ



నేర సమీక్ష సమావేశం లో పాల్గొన్న పోలీస్ అధికారులు

**పుట్టపర్తి, జూన్ 28, ప్రభాతవార్త**

అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించి నేరాలు కట్టడి చేయాలని శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న పోలీస్ అధికారులకు సూచించారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో జిల్లాఎస్పీ నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. పుట్టపర్తి, కదిరి, హిందూపురం , పెనుగొండ సబ్ డివిజన్ లలో ఉన్న పెండింగ్ కేసుల గురించి జిల్లా ఎస్పీ ఆరా తీశారు. పెండింగ్ కేసుల సంఖ్య తగ్గించే విధంగా అన్నిస్థాయిల అధికారులు కృషి చేయాలన్నారు. పెండింగ్ కేసులలో ముద్దాయిల అరెస్టు గురించి ఆరా తీశారు. ప్రాధాన్యత గల కేసులలో ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా భాదితులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రేవ్, నాన్ గ్రేవ్, యుఐ, ఎస్సీ ,ఎస్టీ, ఫోక్సో లోకదాలత్, పొలిటికల్ కేసులపై జిల్లా ఎస్పీ సమీక్షించారు. జిల్లా వ్యాప్తంగా ఓపెన్ డ్రింకింగ్ కార్డ్ న్ సేర్చ్, పల్లెనిద్రలు (నైట్ హాల్ట్) గ్రామ సందర్శనలు చేపట్టి నేరాలు తగ్గించే విధంగా చూడాలన్నారు. రాత్రిపూట గస్తీలు బాగా చేయాలన్నారు. అనుమానాస్పదంగా కనిపించే వ్యక్తుల వేలి ముద్రలను సేకరించి, వాటిని నేర రికార్డులతో సరిపోల్చి నేరగాళ్ళను పట్టుకోవాలన్నారు. ప్రతి సబ్ డివిజన్లో ట్రబుల్ మాంగర్స్ రౌడీషీటర్స్ ని గుర్తించాలని, ప్రధానమైన ప్రాంతాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. దొంగతనాల నివారణకు , ప్రాపర్టీల రికవరికి కృషి చేయాలన్నారు. పోక్సో కేసులలో నివేదికలు త్వరగా సిద్ధం చేయాలన్నారు. లోకదాలత్ కేసులను త్వరగా పరిష్కరించే విధంగా చూడాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులలో బాధితులకు పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో నేరాల నియంత్రణకు గట్టిగా పనిచేసి పోలీస్ ప్రతిష్ట పెంచే విధంగా చూడాలని ఎస్పీ సూచించారు. అనంతరం గత నెలలో వివిధ కేసులలో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులు, పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ నేర సమీక్షా సమావేశంలో ఎస్పీతో పాటు డీఎస్పీలు విజయకుమార్, శివన్నారాయణ, కె.వి మహేష్ ,నరసింగప్ప, ఎస్బిసిఐ బాలసుబ్రమణ్యం రెడ్డి, డిసిఆర్బి సిఐ శ్రీనివాసులు, సిఐలు , ఎస్సైలు , ఐటీ కోర్ ఇంచార్జ్ సుదర్శన్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## వివాదాలకు, అపోహలకు తావివ్వకుండా పారదర్శకంగా వార్డు సెక్రటరీల బదిలీలు



వార్డు సెక్రటరీల కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న కమిషనర్లు,

**అనంతపురం, జూన్ 28, ప్రభాతవార్త**

ఎలాంటి వివాదాలకు, అపోహలకు తావివ్వకుండా పారదర్శకంగా సచివాలయ వార్డు సెక్రటరీల బదిలీల ప్రక్రియ నగరపాలక సంస్థ కమిషనర్ బి.బాలస్వామి పర్యవేక్షణలో నిర్వహించారు. శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లా పరిధిలోని 11 పురపాలక సంస్థలు, నగరపాలక సంస్థకు సంబంధించిన వార్డు సెక్రటరీల బదిలీలు నగరంలోని మూడు కేంద్రాలలో విజయవంతంగా బదిలీలు నిర్వహించి, ఒక్కరోజులోనే ముగించడం విశేషం. ఈ బదిలీల ప్రక్రియ ఉదయం 10 గంటల నుండి రాత్రి 7 గంటల వరకు పురపాలక సంస్థల కమిషనర్లతో కలిసి నగర కమిషనర్ ఈ ప్రక్రియ చేపట్టారు. సీనియారిటీ జాబితా, క్లియర్ వేకెన్సీల జాబితాను పకడ్బందీగా రూపొందించుకొని ఎలాంటి అనుమానాలకు వివాదాలు తలెత్తకుండా చేపట్టడం విశేషం. వార్డు సెక్రటరీలు మొత్తం 6 విభాగాలకు చెందిన సెక్రటరీలు, 3 విభాగాలకు సంబంధించి కౌన్సిలింగ్‌ను కృష్ణ కన్వెన్షన్‌లో, 2 విభాగాల కౌన్సిలింగ్‌లను జయమనెమ్మ కళ్యాణమండపంలో, ఒక విభాగానికి సంబంధించి నగరపాలక సంస్థలోని నూతన కౌన్సిల్ హాలులో నిర్వహించారు. ప్రతి విభాగానికి సంబంధించి, సీనియారిటీ, ఖాళీల వివరాలను స్క్రీన్‌పై ప్రదర్శించి, వెరిఫికేషన్ టీంల ద్వారా పక్కాగా నిర్వహించారు. ఇందులో వార్డు అమినిటీ సెక్రటరీలు, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు, వార్డు ప్లానింగ్ సెక్రటరీలు, వార్డు శానిటేషన్ సెక్రటరీలు, వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు, అడ్మిన్ సెక్రటరీలు మొత్తం 1121 మందికి బదిలీలు చేపట్టారు. ఈ ప్రక్రియలో జిల్లాలోని 12 మంది కమిషనర్లు సర్వీసు రిజిష్టర్ల వివరాలు తీసుకోవడం, సీనియారిటీని పక్కాగా తయారుచేసుకోవడం చేశారు. అడ్మిన్ సెక్రటరీలకు కౌన్సిల్ అధికారిగా రాయదుర్గం కమిషనర్ దివాకర్‌రెడ్డి, శానిటేషన్ సెక్రటరీలకు కౌన్సిల్ అధికారిగా కళ్యాణదుర్గం కమిషనర్ వంశీకృష్ణ, ఎడ్యుకేషన్ సెక్రటరీలకు కౌన్సిల్ అధికారిగా హిందూపురం కమిషనర్ మల్లికార్జున, వెల్ఫేర్ సెక్రటరీలకు కౌన్సిల్ అధికారిగా కదిరి కమిషనర్ కిరణ్‌కుమార్, అమినిటీ సెక్రటరీలకు కౌన్సిల్ అధికారిగా పుట్టపర్తి కమిషనర్ క్రాంతికుమార్, వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు కౌన్సిల్ అధికారిగా తాడిపత్రి కమిషనర్ శివరామకృష్ణలు నిబంధనల మేరకు బదిలీలు చేపట్టారు.



హాజరైన సచివాలయ ఉద్యోగులు